విశాఖపట్టణం
ఆదివారం 21 జూన్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:148 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## నేడు యోగా డే

ముస్తాబైన కోల్ కతా

ఈసారి థీమ్ యోగా ఫర్ హెల్తీ ఏజింగ్

హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోడీ


2

# నేరస్తులకు కులాలు అంటగడతారా

రాజకీయంగా నాయకులు అండగా నిలుస్తారా

అలాంటి నేతలను దూరం పెట్టాలి

నేరస్తులను ప్రొత్సహిస్తే ప్రమాదంలోకి సమాజం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

కాకినాడలో మన ఊరు-మాట మంతి నిర్వహణ





(కాకినాడ - జయజయహే)

కాకినాడలో నిర్వహించిన 'మన ఊరు.. మాట మంతి' కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నడిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేరస్థులకు కులాలు అంటగట్టడం సరికాదని, వారికి రాజకీయంగా అండగా నిలిచే నాయకులను ప్రజలు దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే వ్యక్తులను ఎన్నుకోబోమని ప్రజలు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. నేరస్థులను ప్రోత్సహిస్తే సమాజ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. సుగాలి ప్రీతి హత్య కేసును గతంలో సీబీఐకి అప్పగించాలని తాను ఆందోళన చేశానని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆ సమయంలో ప్రభుత్వం సీబీఐకి కేవలం తూతూమంత్రంగా లేఖ రాసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసును ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నించగా, గత ప్రభుత్వ హయాంలోనే కీలక సాక్ష్యాలు ధ్వంసమయ్యాయని ఆరోపించారు. నేరస్థులను వెనకేసుకొస్తే అది సమాజానికి మంచిది కాదని, క్రిమినల్ గ్యాంగులతో ప్రభుత్వాలు నడవవని స్పష్టం చేశారు. నేర చరిత్ర ఉన్నవారు రాజ్యాంగబద్ధ పదవుల్లో కూర్చొని పాలించాలని ప్రయత్నిస్తే జీవితాంతం పోరాడతానని అన్నారు. నేరస్థులను నెత్తిన పెట్టుకుంటే ప్రజల తలరాతలను ఎవరూ మార్చలేరని వ్యాఖ్యానించారు. 'జెన్‌జీ' అని చెప్పుకోవడం కంటే, తమ భవిష్యత్తును యువతే ..మిగతా 2లో



## విధ్వంసం నుంచి వికాసం వైపు

ఆర్థిక ఆరోగ్యం దిశగా కృషి

ప్రకృతి వ్యవసాయం వైపు ప్రపంచం చూపు

యూరియా వినియోగాన్ని రైతులు తగ్గించాలి

సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు

పల్నాడులో అన్నదాత సుఖీభవ నిధులు జమ

(పల్నాడు - జయజయహే)

పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లాలోని లింగంగుట్లలో శనివారం విడుదల చేశారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రూ.3,125 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7 వేలు జమ చేశామని ..మిగతా 2లో



## అసలేం జరిగింది..!?

కృష్ణలంక కేసులో అదే మిస్టరీ

రంగంలోకి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్

ముమ్మరంగా దర్యాప్తు.. అన్నికోణాల్లోనూ విచారణ

(విజయవాడ - జయజయహే)

విజయవాడ నగరంలో సాయికృష్ణ అదృశ్యం కేసు ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడు, పోలీసులు కస్టడీలో ఉండగానే ప్రాణాలు కోల్పోయడా? లేదా ఎవరైనా మాయం చేశారా? ఈ ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న మిస్టరీని ఛేదించేందుకు ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయమే కృష్ణ లంకలోని సాయికృష్ణ నివాసానికి చేరుకున్న అధికారులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఒకవైపు కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, మరోవైపు పోలీసుల ఇన్వెస్టిగేషన్ మధ్య ఈ కేసులో అనేక మలుపులు తిరుగుతోంది. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చినప్పటి నుంచి స్టేషన్‌లో జరిగిన ..మిగతా 2లో

## బుద్ధిరాని ఎన్టీఏ..!

మళ్లీ అవే తప్పులు.. పొరపాట్లు

ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపులు గందరగోళం

నాగ్ పూర్ విద్యార్థికి అబుదాబిలో పరీక్ష కేటాయింపు

తప్పు తెలుసుకుని తర్వాత దిద్దుబాటు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రీ-ఎగ్జామ్‌కు ముందు మరో కీలక పొరపాటు వెలుగులోకి వచ్చింది. ఎన్టీఏ జారీ చేసిన అడ్మిట్ కార్డుల్లో కొన్ని సాంకేతిక లోపాలు కనిపించగా, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. నాగ్‌పూర్‌కు చెందిన అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే విద్యార్థి రీ-ఎగ్జామ్ కోసం అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత అందులో పేర్కొన్న పరీక్షా కేంద్రాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. తనకు సమీపంలోని నగరంలో ..మిగతా 2లో




## వర్చువల్ హాజరు కుదరదు

వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందే

అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు స్పష్టీకరణ

సంధ్యా థియేటర్ ఘటన తొక్కిసలాట కేసు

(హైదరాబాద్ - జయజయహే)

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ముంబైలో షెడ్యూల్ జరుగుతోంది. భద్రతా కారణాలు, మూవీ షూటింగ్ నేపథ్యంలో వర్చువల్ (ఆన్ లైన్) ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని బన్నీ నాంపల్లి కోర్టును అభ్యర్థించారు. అయితే, అలా కుదరదని కచ్చితంగా కోర్టు ముందు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది న్యాయస్థానం. దీంతో ఆయన సోమవారం ..మిగతా 2లో



## ట్రెండింగ్‌లో మోడీ వాచ్

వరల్డ్ హాట్ టాపిక్ గా మేడ్ ఇన్ ఇండియా వాచ్

భారతీయ గర్వానికి చిహ్నంగా బాఘ్ టైమ్‌పీస్





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

జీ7 సదస్సు వేదికగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మణికట్టుపై మెరిసిన ఒక స్వదేశీ వాచ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ ధరించిన జైపూర్ వాచ్ కంపెనీ కి చెందిన బాఘ్ టైమ్‌పీస్.. సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ట్రెండ్ అవుతోంది. మేక్ ఇన్ ఇండియా కు, భారతీయ వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ లగ్జరీ వాచ్ కథనం అంతర్జాతీయ స్థాయిలో మన దేశీ బ్రాండ్ ఖ్యాతిని చాటిచెబుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన ఈ వాచ్ సాధారణమైనది కాదు; దీని వెనుక భారతదేశ స్వాతంత్ర్య చరిత్ర దాగి ఉంది. జైపూర్ వాచ్ కంపెనీకి చెందిన సిగ్నేచర్ బాఘ్ కలెక్షన్‌లో భాగంగా రూపొందించిన ఈ వాచ్ డయల్‌లో.. బ్రిటిష్ ఇండియా చివరి సంవత్సరమైన 1947 నాటి అసలైన ఒక రూపాయి నాణేన్ని ఉపయోగించారు. ఈ నాణెంపై గంభీరంగా నడుస్తున్న పులి బొమ్మతో పాటు ..మిగతా 2లో

## 16 డ్రగ్స్‌పై నిషేధం

తయారీ, పంపిణీ, అమ్మకంపై బ్యాన్

ఫిక్స్ డ్ డోస్ కాంబినేషన్ పై చర్యలు

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వైద్యపరంగా సరైన ఆధారాలు లేవని, చికిత్సలో ప్రత్యేక ప్రయోజనం లేదని నిపుణుల కమిటీ నిర్ధారించిన 16 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, పంపిణీపై కేంద్రం నిషేధం విధించింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద, ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీని తక్షణమే నిషేధించింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ..మిగతా 2లో



# అసలేం జరిగింది..!?

**మొదటి పేజీ తరువాయి...**

పరిణామాల వరకు ప్రతి అంశాన్ని దర్యాప్తు బృందం భూతద్దంతో వెతుకుతోంది. ముఖ్యంగా పోలీసులపైనే ఆరోపణలు వస్తుండటంతో సాక్ష్యాల సేకరణలో అధికారులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏసీబీ దైవప్రసాద్ బృందం నేరుగా సాయికృష్ణ ఇంటికి వెళ్లింది. అక్కడ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు, పిన్ని కనకదుర్గలను సుదీర్ఘంగా విచారించి వారి స్టేట్మెంట్‌లు రికార్డ్ చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు విచరణాధికారులను సైతం విస్మయానికి గురి చేశాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్ లాకప్‌లో ఉంచారని, అక్కడ సీఐ నాగరాజు అతడిని అమానుషంగా చిత్ర వధ చేసి చంపేశారని వారు ఆరోపించారు.





**హార్డ్‌డిస్క్‌లు, డీవీఆర్ పరికరాలు సీజ్**

కుటుంబ సభ్యుల స్టేట్మెంట్‌ల అనంతరం దర్యాప్తు టీం కృష్ణ లంక స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కేవలం మాటలతో కాకుండా డిజిటల్ ఎవిడెన్స్ ఆధారంగా నిజానిజాలు తేల్చాలని నిర్ణయించింది. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలు అత్యంత కీలకం కావడంతో అప్పటికప్పుడు ఫోరెన్సిక్ అండ్ సైబర్ అనాలసిస్ టీమ్ పిలపించారు. వీటిన్నింటినీ అధికారులు సీజ్ చేసి, విశ్లేషణ కోసం నేరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ రాత్రి స్టేషన్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఈ డిజిటల్ ఆధారాలే ఇప్పుడు కీలకంకానున్నాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు ఎప్పుడు తీసుకొచ్చారు? ఈ ఆపరేషన్‌లో ఎవరెవరు పాల్గొన్నవారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితోపాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని శుక్రవారం దర్యాప్తు టీం విచారించింది. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీ డబ్ల్యూ అమలు చేసేందుకే సాయికృష్ణ కోసం నలుగురు సిబ్బందిని మార్కాపురం పంపినట్టు ఏడీసీపీ వివరించినట్టు సమాచారం. అయితే అతడి తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు.?లాకప్‌లో ఉంచిన సమయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు వారి స్టేట్మెంట్‌లు రికార్డు చేశారు.

**రంగంలోకి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ**

కేసు తీవ్రతను దృష్ట్యా, ఈ అదృశ్యం వ్యవహారంపై విచారణాధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం విజయవాడకు చేరుకుని, తొలుత డీజీపీని కలిసి కేసు పురోగతిని వివరించారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖరబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా ప్రశ్నిస్తూ, ఎక్కడైనా గ్యాప్స్ ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రస్తుతానికి దర్యాప్తు బృందం ఎనిమిది మంది కీలక సిబ్బందిని విచారిస్తోంది. ఇందులో టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ట్రెండింగ్‌లో మోడీ వాచ్

**మొదటి పేజీ తరువాయి...**

ONE RUPEE INDIA 1947 అనే అక్షరాలు ఉంటాయి. భారతదేశ చరిత్రను, ఆధునిక మెకానికల్ వాచ్ మేకింగ్ టెక్నాలజీతో జపనీస్ మియోటా ఆటోమేటిక్ మూవ్‌మెంట్ మిళితం చేసి సుమారు రూ. 60,000 ధర పరిధిలో అందించే ఈ యాక్సెస్బుల్ లగ్జరీ టైమ్‌పీస్ ఇప్పుడు గ్లోబల్ స్టేజ్‌పై భారతీయ గర్వానికి చిహ్నంగా నిలిచింది. ఈ అద్భుత బ్రాండ్ వెనుక ఒక మొదటి తరం పారిశ్రామికవేత్త పట్టుదల ఉంది. చిన్నప్పటి నుండి పాత నాణేలు, స్టాంపులను సేకరించే అలవాటున్న గౌరవ్ మెహతా అనే యువకుడు.. 2013లో రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా జైపూర్ వాచ్ కంపెనీ ని స్థాపించారు. స్విస్ వాచీల హవా నడుస్తున్న మార్కెట్లో భారతదేశపు మొట్టమొదటి బెస్పోక్ లగ్జరీ వాచ్ మైక్రోబ్రాండ్‌ను నిర్మించాలనేది ఆయన కల. ప్రారంభంలో పెట్టుబడుల కోసం, బ్రాండ్ మార్కెటింగ్ కోసం గౌరవ్ తన సొంత కారును కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. దేశీయంగా లగ్జరీ వాచ్ తయారీ రంగానికి మద్దతు లేకపోయినా, పట్టుదలతో జైపూర్‌లోనే డిజైన్, అసెంబ్లీ యూనిట్లను ఏర్పాటు చేసి బ్రాండ్‌ను నిలబెట్టారు.

**బ్రాండ్ ఫిలాసఫీ ప్రత్యేకం!**

ఒక టైమ్‌పీస్ అనేది కేవలం సమయాన్ని చూపించేది కాదు.. అది చరిత్రను భద్రపరిచేది కావాలి అనేదే ఈ కంపెనీ ప్రధాన సిద్ధాంతం. కేవలం విదేశీ డిజైన్లను కాపీ కొట్టకుండా.. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే పాత నాణేలు, రాచరికపు ముద్రలు, పోస్టల్ స్టాంపులు, పిచ్వాయ్ సాంప్రదాయ చిత్రకళను వాచీల డయల్స్‌లో పొందుపరుస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఎవరైనా కస్టమర్లు తమ పూర్వీకుల నాణేలు లేదా మోనోగ్రామ్‌లను ఇస్తే.. వాటిని రాబోయే తరాలకు గుర్తుండిపోయేలా అమూల్యమైన చేతి గడియారాలుగా మార్చి ఇవ్వడం జైపూర్ వాచ్ కంపెనీ ప్రత్యేకత. గడిచిన 13 ఏళ్లలో ఈ బ్రాండ్ మంచి వృద్ధిని సాధించింది. అంతర్జాతీయ పాప్ సింగర్ ఎడ్ షీరన్ సైతం ఖరీదైన స్విస్ వాచీలను పక్కనబెట్టి జైపూర్ వాచ్ కంపెనీ వింటేజ్ కాయిన్ వాచ్‌ను ఎంపిక చేసుకోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. గతంలో ఒక ఏఐ సదస్సులో కూడా ప్రధాని మోదీ ఈ వాచ్‌తో కనిపించగా.. ఇప్పుడు ఏకంగా ప్రపంచ దేశాల అధినేతలు పాల్గొన్న జీ7 సదస్సులో దీనిని ధరించడంతో ఈ మేడ్ ఇన్ ఇండియా బ్రాండ్ గ్లోబల్ లగ్జరీ మార్కెట్లో హాట్ కేక్‌లా మారింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 కి పైగా స్టోర్లతో ఓమ్నీచానెల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న ఈ సంస్థ.. ఆర్థిక సంవత్సరం 2026 నాటికి రూ. 40 కోట్లకు పైగా ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని దూసుకుపోతోంది. ఒకప్పుడు లగ్జరీ వాచ్ అంటే కేవలం స్విట్జర్లాండ్ బ్రాండ్ల వైపే చూసే భారతీయులకు.. జైపూర్ వాచ్ కంపెనీ వోకల్ ఫర్ లోకల్ నినాదంతో కొత్త ఆప్షన్‌ను పరిచయం చేసింది. జైపూర్ వీధుల్లో నాణేలతో ఆడుకునే ఒక చిన్న పిల్లాడి ఆలోచన నుండి పుట్టిన బ్రాండ్.. నేడు దేశ ప్రధాని చేతికి చేరి అంతర్జాతీయ దౌత్య వేదికలపై మెరవడం అనేది ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గ పరిణామం. సాంప్రదాయ కథనాలకు, హస్తకళలకు సరైన ప్రాధాన్యత ఇస్తే అంతర్జాతీయ మార్కెట్లను కొల్లగొట్టవచ్చని గౌరవ్ మెహతా సక్సెస్ స్టోరీ నిరూపిస్తోంది.

# వర్చువల్ హాజరు కుదరదు

**మొదటి పేజీ తరువాయి...**



బన్నీ నాంపల్లి కోర్టుకు హాజరు కానున్నారు. దీంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కేసులో బన్నీని పోలీసులు ఏ11గా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకూ నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. ఇప్పటివరకూ 23 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. మొత్తం 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. 2024, డిసెంబర్ 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా... ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అభిమానులతో కలిసి ప్రీమియర్ షో చూసేందుకు వెళ్లిన బన్నీని చూసేందుకు ఫ్యాన్స్ ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనకు యాజమాన్యంతో పాటు బన్నీని కూడా బాధ్యున్ని చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన తర్వాత బాధిత కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు మూవీ టీం అండగా నిలిచింది. బాలుడు శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వైద్య సాయంతో పాటు ఫ్యామిలీకి కూడా సాయం అందించారు.



# నేరస్తులకు కులాలు అంటగడతారా

**మొదటి పేజీ తరువాయి...**

నిర్ణయించుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. తాను మళ్లీ ఎన్నికల్లో గెలుస్తానో లేదో తెలియదని, కానీ ప్రజల కోసం పోరాటం మాత్రం కొనసాగిస్తానని చెప్పారు. విపక్షం మళ్లీ అధికారంలోకి వస్తుందేమోనని భయపడాల్సిన అవసరం లేదని, రౌడీయిజం, గూండాయిజానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు నాయకులు కొన్ని అంశాలపైనే స్పందిస్తారని, తాను మాత్రం ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంపై స్పందిస్తానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేస్తే అప్పుడు లేని కులం ఇప్పుడెందుకు వచ్చిందన్నారు. ఒక రౌడీ ఎలిమెంట్ చనిపోతే.. కొందరు ఇష్టం వచ్చినట్టు కులం పేరుతో మాట్లాడుతుంటే మనవైపు ఇంత మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేస్తున్నారని పవన్ మండిపడ్డారు. అన్నింటికీ తానే మాట్లాడాలంటే ఎలా కుదురుతుందన్నారు. కులాల దరిద్రం వదిలితేనే ఏపీ బాగుపడుతుందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ చాలా కఠినంగా ఉండాలన్నారు. తాను హోంమంత్రిని కాదని..అది క్రిమినల్స్ అదృష్టమని పవన్ వ్యాఖ్యానించారు.

# బుద్ధిరాని ఎన్టీఏ..!

**మొదటి పేజీ తరువాయి...**

కాకుండా, ఏకంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని అబూదాబిలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించినట్లు అడ్మిట్ కార్డులో పేర్కొనబడింది. అబ్దుల్లా దరఖాస్తు సమయంలో పరీక్షా కేంద్రాల ఎంపికలో నాగ్‌పూర్, వర్ధా, భండారా జిల్లాలను మాత్రమే ఎంపిక చేసినట్లు అతని తండ్రి తెలిపారు. అయితే అడ్మిట్ కార్డులో అబుదాబిలోని ఓ భారతీయ పాఠశాలను పరీక్షా కేంద్రంగా చూపించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విదేశాలకు వెళ్లాలన్నా ఆ విద్యార్థి వద్ద పాస్‌పోర్ట్ కూడా లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వెంటనే అతడి తండ్రి ఎన్టీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారగా, ఎన్టీఏ అధికారులు స్పందించారు. ఇది సాంకేతిక పొరపాటు వల్ల జరిగిందని, విద్యార్థికి నాగ్‌పూర్‌లోనే పరీక్షా కేంద్రం కేటాయిస్తామని స్పష్టం చేశారు. సవరించిన వివరాలను ఈ సాయంత్రంలోపు అందజేస్తామని తెలిపారు. ఆదివారం జరగనున్న రీ–ఎగ్జామ్‌కు ముందు ఇలాంటి పొరపాటు బయటపడటం అభ్యర్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. అయితే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఎన్టీఏ హామీ ఇవ్వడంతో విద్యార్థి కుటుంబం ఊరట పొందింది. అంతకుముందు ఈ విషయంపై అబ్దుల్లా తండ్రి మాట్లాడుతూ.. "నిన్న సాయంత్రం 4 గంటలకు అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసిన తర్వాత అబుదాబిలోని స్కూల్‌ను పరీక్షా కేంద్రంగా చూపించడం చూసి మేమంతా షాక్ అయ్యాం. అలాంటి ఎంపికను మేమెప్పుడూ ఇవ్వలేదు. వెంటనే ఎన్టీఏ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగా, ఇమెయిల్ పంపాలని సూచించారు. ఇమెయిల్ పంపిన తర్వాత అధికారులు ఫోన్ చేసి శనివారం సాయంత్రం 4 గంటలలోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని చెప్పారు" అని వెల్లడించారు.



# విధ్వంసం నుంచి వికాసం వైపు

**మొదటి పేజీ తరువాయి...**

పేర్కొన్నారు. బటన్ నొక్కగానే 99.8 శాతం రైతులకు నిధులు జమయ్యాయని తెలిపారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. విధ్వంసం నుంచి ఏపీని వికాసం వైపు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని వివరించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు. మనం ఆర్థికంగా, ఆరోగ్యంగా బాగుండాలని ఆకాంక్షించారు. వైసీపీ హయాంలో రైతులకు అన్నీ కష్టాలే అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన.. 6 నెలలకు కూడా డబ్బులు వచ్చేవి కాదని అన్నారు. ఇప్పుడు 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని వివరించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా రైతుల అవసరాలను గుర్తిస్తున్నామని చెప్పుకొచ్చారు. అన్నదాతలు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మళ్లీ ప్రకృతి సేద్యం వైపు ప్రపంచం చూస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. పామాయిల్ పంటలో అంతర్గత పంటలూ వేసుకోవచ్చని చెప్పారు. మనం ప్రకృతి సేద్యం వైపు మారాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతామని అన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా తయారైందని వివరించారు. పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. నదుల అనుసంధానం తన జీవిత ఆశయమని ఉద్ఘాటించారు. నదుల అనుసంధానం జరిగితే ఏపీకి తిరుగుండదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# నేడు యోగా డే

**ముస్తాబైన కోల్ కతా**

**ఈసారి థీమ్ యోగా ఫర్ హెల్తీ ఏజింగ్**

**హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోడీ**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలకు కోల్‌కతా ముస్తాబైంది. జూన్ 21న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్‌లో జరిగే ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం వహించనున్నారు. "యోగా ఫర్ హెల్తీ ఏజింగ్" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలు నిర్వహిస్తున్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉంది. జూన్ 21, ఆదివారం ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వేలాది మంది యోగా సాధకులు ప్రత్యక్షంగా పాల్గొననుండగా, దేశ విదేశాల నుంచి లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనే అవకాశం ఉంది. కామన్ యోగా ప్రోటోకాల్ ఆధారంగా నిర్వహించే ఈ సామూహిక యోగా కార్యక్రమంలో ప్రధాని మోదీ స్వయంగా పాల్గొని దేశ ప్రజలకు మార్గనిర్దేశనం చేయనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ చేపట్టిన యోగా సంగమ్ పోర్టల్‌కు అపూర్వ స్పందన లభించింది. ఇప్పటికే 6 లక్షలకు పైగా సంస్థలు ఇందులో నమోదు కావడం విశేషం. యోగాను ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా ఇది ఒక కీలక మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో యోగా దినోత్సవానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఇండియా కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ సమన్వయంతో ప్రపంచవ్యాప్తంగా 210కి పైగా భారతీయ మిషన్లు, దాదాపు 2,500 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. దీంతో భారతీయ యోగా సంప్రదాయం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరిస్తోందని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ఇక దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఢిల్లీలోని ఎర్రకోట, హరిద్వార్, కోణార్క్ సూర్య దేవాలయం, హంపి, మహాబలిపురం, హైదరాబాద్ సహా 100 చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు జరగనున్నాయి. భారతీయ సంస్కృతి, వారసత్వం, యోగా సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ కార్యక్రమాలను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాను కేవలం వ్యాయామంగా కాకుండా జీవనశైలిగా స్వీకరించాలనే సందేశాన్ని మరోసారి బలంగా వినిపించనుంది.

# 16 డ్రగ్స్‌పై నిషేధం

**మొదటి పేజీ తరువాయి...**

ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారు. అయితే కొన్ని కాంబినేషన్లు రోగులకు అదనపు ప్రయోజనం కలిగించకపోగా, ఆరోగ్య సమస్యలు సృష్టించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించింది. కమిటీ సిఫార్సుల ఆధారంగా, 16 కాంబినేషన్లు అహేతుకమైనవని, వాటిని కొనసాగించడం ప్రయోజనకరం కాదని ప్రభుత్వం నిర్ధారించింది. నిషేధిత జాబితాలో యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ, కడుపు తిమ్మిర్లకు ఉపయోగించే మందులు, కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి . అమోక్సిసిలిన్ ం సెరాటియోపెప్టిడేస్, అమోక్సిసిలిన్ ం సెరాటియోపెప్టిడేస్ ం లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్, సెఫ్యూరాక్సిమ్ ం సెరాటియోపెప్టిడేస్, సెఫాడ్రాక్సిల్ ం ప్రోబెనెసిడ్, డైసైక్లోమైన్ ం పారాసెటమాల్ ం క్లిడినియం బ్రోమైడ్ ం క్లోర్డియాజెపాక్సైడ్‌తో పాటు అనేక కలబంద ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. సురక్షితమైన, ప్రభావవంతమైన, శాస్త్రీయంగా ధ్రువీకరించిన మందులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటమే తమ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

# మాజీ సీఎం జగన్ పరిపాలనలో అన్ని వర్గాలవారికి సంక్షేమం

**విశాఖపట్నం (జయ జయహే)**

మద్దిలపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ నాయకుల సమావేశానికి విశాఖ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు నిడుగట్టు రాజశేఖర్ అధ్యక్షత వహించారు .సమావేశం ప్రారంభ ప్రార్థన మరియు సందేశం క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గరికముక్కల పాల్ విక్టర్ అందించి విక్టర్ పాల్ మాట్లాడుతూ క్రైస్తవులందరూ ఐకమత్యంతో పనిచేసి క్రిస్టియన్ మైనార్టీ సెల్ ను బలపరచవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. వైస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు సిద్ధాంతాల మేరకు ఈ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ను ఈ ఉత్తరాంధ్రలో ప్రజలలోకి తీసుకు వెళ్లవలసిన అవసరం ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించడం జరిగిందని అదేవిధంగా వివిధ పదవులలో అనేకమంది క్రైస్తవులను నియమించడం జరిగిందని తెలియజేశారు. కానీ ఈ కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ఒక్క క్రైస్తవ నాయకుడిని కూడా ఏ నామినేటెడ్ పదవుల లోను నియమించలేదని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమం మరియు రాష్ట్రానికి అభివృద్ధి జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో క్రిస్టియన్ మైనార్టీ సెల్ ను



ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు. క్రైస్తవులు నాయకులుగా ఎదగాలని ఇతరుల మీద ఆధారపడకుండా ఎలక్షన్స్ లో నిలబడే నాయకత్వం క్రైస్తవులలో పెంపొందించాలని ఈ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ను జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అందువలనే క్రైస్తవులైన మనందరం నాయకులుగా ఎదిగి ఈ వేదిక మీద నుంచి ప్రసంగించే అవకాశాన్ని వైయస్ జగన్మోహన్ రెడ్డి ద్వారా మనం పొందామని తెలియజేశారు. అందువలన క్రైస్తవులైన మనందరం జగన్మోహన్ రెడ్డి కి కృతజ్ఞత తెలుపవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో క్రైస్తవులకు ఎన్నో మేలులు జరిగాయని తెలియజేస్తూ, ఇప్పుడున్న ఈ కూటమి ప్రభుత్వానికి క్రైస్తవులు అంటే నిర్లక్ష్య వైఖరి ఏర్పడిందని .ఈ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇంతవరకు క్రైస్తవుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, అదేవిధంగా క్రైస్తవులు పవిత్రంగా భావించే హోలీ ల్యాండ్ యాత్ర కు కూడా ఒక్క రూపాయి విడుదల చేయ లేదని తెలియజేశారు. ఇంతవరకు ఒక్కరిని కూడా జెరూసలేం యాత్రకు పంపించలేదని తెలియజేశారు. 2019- 24 మధ్య కాలంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు క్రైస్తవుల సంక్షేమానికి 416 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలియజేశారు. 1,80,000 మంది క్రైస్తవులు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో లబ్ధి పొందడం జరిగిందని తెలియజేశారు.ఈ ప్రభుత్వంలో క్రైస్తవులందరూ భయపడే విధంగా కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారని తెలియజేశారు. ఈ లౌకిక రాజ్యంలో పాలకులు మతం అనేది వ్యక్తిగతమని అది రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని మరచిపోయి ప్రవర్తిస్తున్నారని తెలియజేశారు. ఈ కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేసిన క్రైస్తవులందరూ ఈరోజు బాధపడే పరిస్థితి వచ్చిందని తెలియజేస్తూ, ఎలక్షన్స్ ఎప్పుడు వచ్చినా మరల వైస్ జగన్మోహన్ రెడ్డి ని గెలిపించి ముఖ్యమంత్రి చేయవలసిన ఆవశ్యకత ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు జోసఫ్ , తిమోతి , మధు, స్టీఫెన్ ,క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీలు ప్రతి అన్వేష్ ,మోకాన సుధాకర్ ,సెక్రటరీ డేవిడ్ రాజు మరియు ఉత్తరాంధ్రలోనిక్రైస్తవ సంఘాల ముఖ్య నాయకులైన ఆర్ఎస్ జాన్,జేమ్స్ వీకేకుంపట్ల, బిషప్ బాలరాజు, బిషప్ జాన్ మేరీ, రెవరెండ్ హనీ జాన్సన్, బిషప్ విజయబాబు, బిషప్ ఆనంద్ రెవరెండ్ ప్రేమానందం మరియు ఉత్తరాంధ్ర జిల్లాల క్రిస్టియన్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు





# మాడుగుల ప్రభుత్వాసుపత్రిలో మళ్ళీ డాక్టర్లు కొరత

## వెంటనే భర్తీ చేయాలని స్థానిక విజ్ఞప్తి

**మాడుగుల జూన్ 20 జయ జయహే**



అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్టు మరలా మాడుగుల ఆసుపత్రి పరిస్థితి తయారయింది. ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయి వైద్యులతో ఆసుపత్రి రోగులకు అన్ని రకాల సేవలు అందుతున్నాయన్న తరుణంలో మరల ఆసుపత్రికి పూర్వ పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రికి పూర్వ పరిస్థితి వచ్చిందంటూ ఆరోపణలో విను వస్తున్నాయి. ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో 9 మంది డాక్టర్లు సేవలు అందించేవారు. తాజాగా నలుగురు డాక్టర్లు బదిలీ కావడంతో గత రెండు మాసాల నుంచి కేవలం నలుగురు డాక్టర్లతోనే ఆసుపత్రి కొనసాగుతుంది. రోజుకి 150 నుంచి 160 మంది రోగులు వస్తుండగా సోమవారం గురువారం రోజుల్లో ఆ సంఖ్య 250 వరకు చేరుతుందని వైద్యులు చెబుతున్నారు. దీంతో కొన్ని రోగాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు. డ్రెస్ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనిక్, మత్తు డాక్టర్, ఎన్సీడీ ఎంబిబిఎస్ డాక్టర్లు బదిలీపై వెళ్లారు. దీంతో సర్జన్, పీడియాట్రిక్, డెంటల్ తో పాటు ఇద్దరు ఎంబిబిఎస్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. గైనిక్ వెళ్లిపోవడంతో ఆపరేషన్లు నిలిచిపోయాయి. అలాగే పూర్తిస్థాయి మందులతో పాటు ఎక్రే ప్లాంట్ కూడా అందుబాటులో ఉండడంతో రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. త్రిభుజంలో మండల నియోజకవర్గ కేంద్రం ఎక్కువ గిరిజన ప్రాంతాన్ని కూడి ఉన్న మాడుగుల ప్రభుత్వాసుపత్రికి వెంటనే డాక్టర్లను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే అత్యవసరంగా జనరల్ మెడిసిన్ గైనిక్ మత్తు డాక్టర్లను నియమించాలని వారితోపాటు కొత్తగా ఎముకుల డాక్టర్లను కూడా అందుబాటులో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రస్తుతం ఆస్పత్రి ఇంచార్జ్ జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు రెండు మాసాల క్రితం నలుగురు డాక్టర్లు బదిలీపై వెళ్లారని వారి స్థానంలో కొత్తవారు రావాల్సి ఉందని చెప్పారు. ఇటీవల కౌన్సిలింగ్ కూడా నిర్వహించారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే తో పాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కూడా తగు చొరవ స్థానికులు కోరుతున్నారు.



# రైతులను ఆదుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**మాడుగుల జూన్ 20 జయ జయహే**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం మాడుగుల మండలం జేడీపేట పంచాయతీలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ లైవ్ కార్యక్రమంలో వారు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమం తప్పకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యవసాయ పెట్టుబడులు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తుందని, అనేక రకాల వంగడాలను పిత్రాలను అందుబాటులోకి తెచ్చి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తుందని వారు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు రైతు సాయాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. నూతన విధానాలతో వ్యవసాయాన్ని మెరుగుపరుచుకుంటూ సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. సందర్భంగా జరిగిన సభలో ఎంపీపీ రాజారాం సచివాలయ కార్యదర్శి స్థానిక రైతుల పాల్గొని అనురాధ సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమాన్ని తిలకించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన పాలనను అందిస్తాం

## నియోజకవర్గ శాసనసభ్యులు గొండు.శంకర్

**శ్రీకాకుళం. - (జయ జయహే )**

శ్రీకాకుళం నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన పాలనను అందిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర వేదికగా తెలిపారు.. ఐదేళ్ల కాలంలో రైతులు పడ్డ కష్టాలను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, ప్రస్తుత పాలనలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, సరిహద్దు గ్రామాలకు నీరు అందించేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన వెల్లడించారు. దీని ఫలితంగా గత రెండు సంవత్సరాలుగా పంటలు సమృద్ధిగా పండుతున్నాయని, కృష్ణా-గోదావరి డెల్టా తరహాలో శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వంశధార ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తూ, నామినేటెడ్ కమిటీల ద్వారా నిధుల సమీకరణతో పాటు పల్లిపాడు, వెలంపేట వంటి గ్రామాల్లో రోడ్ల నిర్మాణం మరియు నారాయణపురం ఎడమ కాలువ పనులను పూర్తి చేస్తున్నామని, తద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడమే కాకుండా, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తోడ్పడుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావిస్తూ, పాలకొండ నుండి ఇచ్ఛాపురం వరకు రైల్వే జోన్ విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మండలాల అభివృద్ధికి, నియోజకవర్గ ప్రగతికి సంబంధించి తాము స్పష్టమైన రోడ్ మ్యాప్‌తో ముందుకెళ్తోందని, రాబోయే మూడు ఏళ్లలో శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్తామని గొండు శంకర్ హామీ ఇచ్చారు.



# చోడవరం నియోజకవర్గంలో మరో 29 కొత్త పోలింగ్ కేంద్రాలు

## బిఎల్వోలుకు బిఎల్ఏలు సహకరించండి

**చోడవరం జూన్ 20 జయ జయహే**

అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఐఆర్ పై రాజకీయ నాయకులు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా చోడవరం నియోజవర్గం పై సమీక్ష జరిగినప్పుడు ఇప్పటివరకు చోడవరం నియోజకవర్గంలో 243 పోలింగ్ స్టేషన్స్ ఉండగా, కొత్తగా మరో 29 పోలింగ్ స్టేషన్స్ చేర్చబడతాయని డిఆర్ఓ తెలియజేశారనీ వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య తెలిపారు. అలాగే బిఎల్ఓ లకి బిఎల్ఏలు అందుబాటులో ఉండమని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయమని సూచించారన్నారు. ఏమైనా తొలగింపులు ఉన్నట్లయితే యాడ్ చేసుకునే అవకాశం ఉందని భయపడినవసరం లేదని తెలియజేశారు, డోర్ నెంబర్ ప్రకారం ఎస్ ఐ ఆర్ కార్యక్రమం చేయబడుతుందని ఎన్నికల అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సాగర్ నగర్‌బీచ్‌లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

**సాగర్ నగర్, జూన్ 20:(జయ జయహే)**



పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్రలో భాగంగా శనివారం సాగర్ నగర్ బీచ్ క్లీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు వేలాది మంది పర్యాటకులు వచ్చే బీచ్ ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, కూటమి శ్రేణులతో పాటు మనవడు విఖ్యాత్ తో కలిసి బీచ్ లో చెత్త తొలగించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపీ, మంగాదేవి, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యూరులో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ లైవ్ టెలికాస్ట్..

## రైతుల ఖాతాల్లో 6.80 కోట్లు జమ.

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ జూన్ 21**





అల్లూరి జిల్లా కొయ్యురు లో అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకాల కార్యక్రమ లైవ్ టెలికాస్ట్ ను కొయ్యూరు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు.ఈ సందర్భంగా కొయ్యూరు మండలానికి అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకాల కింద మొత్తం 6.80 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు తెలిపారు. చీడిపాలెం రైతు సేవ కేంద్రం లో జరిగిన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.శివ రామ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి కళ్యాణి, పరిమళలి, ఎం.వి.వి. ప్రసాద్, చిన్న మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు. అధికారులు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించి, సకాలంలో డబ్బులు జమ అవుతాయని భరోసా ఇచ్చారు.



# పారిశుధ్య కార్మికులకు పి.ఎ.ఫ్ ఈ.ఎస్.ఐ కల్పించాలి

**చోడవరం, జూన్ 20, జయ జయహే**

చోడవరం మేజర్ పంచాయితీలో సుమారుగా 20 ఏళ్లు పైబడి పనిచేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నేటి వరకు పి.ఎఫ్ . ఈ.ఎస్.ఐ లేకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం చోడవరం వచ్చిన డిపిఓ కి సిపిఐ ఆధ్వర్యంలో వారు వినతిపత్రం అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగోలేనప్పుడు సరైన వైద్యం చేయించుకోలేక మంచాన పడుతున్నారన్నారు. గతంలో చాలా సందర్భాల్లో పంచాయతీ అధికారులకు విషయాన్ని తెలియజేసిన కనీసం నేటి వరకు కూడా కంట్రిబ్యూషన్ కట్టకుండా పారిశుధ్య కార్మికుల్ని అగమ్య గోచరంగా వదిలేశారన్నారు.నేటికి సుమారుగా నాలుగు నెలలు జీతాలు బకాయిపడి చెల్లించకుండా కార్మికులను జీవితాల్ని రోడ్ను పడేసి,ఆకలి కేకలతో పస్తులు, పెట్టి ఉన్న పంచాయతీ అధికారి పైన చర్యలు చేపట్టాలని నేడు చోడవరం విచ్చేసిన పంచాయతీ డిపిఓకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పొట్నూర అప్పారావు. జలగడుగులు గణేష్, సోమాదుల లక్ష్మీ, జలగడుగుల కృప, పొట్నూరు ఈశ్వరరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు



# ఓటును కాపాడుకోవడం మన బాధ్యత

## రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్డిఓ సమావేశం

**టెక్కలి జూన్ 20 జయ జయహే**

ఓటు ను ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా తమ గ్రామంలో సర్ ( స్పెషల్ ఇంటెన్షన్ రివిజన్) కార్యక్రమం ద్వారా ఓటును కోల్పోకుండా సరి చేసుకోవాలి ,బి ఎల్ ఓ బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారా మ్యాపింగ్ అంశాలను అవగాహనపరిచేందుకు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో టెక్కలి ఆర్డిఓ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి సమీక్ష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో అంగన్వాడి టీచర్లకు ఓటర్ జాబితాను అందజేయడం జరిగిందని ప్రతి ఒక్క ఓటరు తమ పూర్తి సమాచారంను మ్యాపింగ్ వేయించి మన ఓటును మనమే బాధ్యతగా కాపాడుకోవాలని దీనికి రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ సహకారాన్ని అందించాలని సర్ అంశాలపై ఆర్డీవో వివరించారు, ఈ కార్యక్రమానికి తెదేపా, బిజెపి, జనసేన ప్రతినిధుల సందేహాలకు ఆర్డీవో కృష్ణమూర్తి సమగ్రంగా అవగాహన కల్పించారు.

For a pure tomorrow..
జయహో

## విశ్వాసం కోల్పోతున్న

# కుటుంబ వ్యవస్థ

(సి.హెచ్.ప్రతాప్)

కుటుంబం అనేది సమాజానికి మూలస్తంభం. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, విశ్వాసం అనే నాలుగు స్తంభాలపై కుటుంబ వ్యవస్థ నిలబడుతుంది. వీటిలో విశ్వాసం అత్యంత ముఖ్యమైనది. ఒకసారి విశ్వాసం దెబ్బతింటే కుటుంబ బంధాలు బలహీనపడతాయి. నేటి వేగవంతమైన జీవనశైలి, సాంకేతిక ప్రభావం, వ్యక్తిగత స్వార్థం పెరగడం వంటి కారణాలతో కుటుంబాల్లో విశ్వాస బంధాలు క్రమంగా సడలుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గతంలో కుటుంబ సభ్యులు కలిసి కూర్చొని మాట్లాడుకునేవారు. సమస్యలను పంచుకునేవారు. ఒకరి సంతోషం, బాధను మరొకరు అర్థం చేసుకునేవారు. ప్రస్తుతం డిజిటల్ పరికరాల వినియోగం పెరగడంతో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ పరస్పర సంభాషణ తగ్గిపోతోంది. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, వినోద కార్యక్రమాలు కుటుంబ సభ్యుల మధ్య ఉండాల్సిన అనుబంధాన్ని కొంత మేర ప్రభావితం చేస్తున్నాయి.

కుటుంబాల్లో విశ్వాసం తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. సహనం లోపించడం వాటిలో ప్రధానమైనది. చిన్నచిన్న అపార్థాలు, అభిప్రాయ భేదాలు పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకోవాల్సిన విషయాలను అహం, మొండితనం కారణంగా మరింత క్లిష్టం చేసుకుంటున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నం తగ్గిపోవడం కూడా సమస్యలకు దారితీస్తోంది.

ఆర్థిక పరిస్థితులు కూడా కుటుంబ సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆదాయ వ్యత్యాసాలు, ఖర్చుల విషయంలో విభేదాలు, ఇతరులతో పోల్చుకునే ధోరణి కుటుంబాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. అదేవిధంగా మాటల్లో దురుసుతనం, గౌరవం లోపించడం, పెద్దల అనుభవాన్ని పట్టించుకోకపోవడం వంటి అంశాలు కూడా బంధాలను బలహీనపరుస్తున్నాయి.

విశ్వాసం క్షీణించినప్పుడు కుటుంబ ఐక్యత దెబ్బతింటుంది. ఒకే ఇంట్లో నివసిస్తున్నప్పటికీ మనసుల మధ్య దూరం పెరుగుతుంది. కుటుంబ సభ్యులు తమ భావాలను పంచుకోలేక ఒత్తిడికి గురవుతారు. దీనివల్ల మానసిక ఆందోళనలు, ఒంటరితనం, నిరాశ వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా యువతపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. కుటుంబ మద్దతు తగ్గినప్పుడు వారు భావోద్వేగపరంగా బలహీనపడే ప్రమాదం ఉంది.

కుటుంబం అనేది పిల్లలకు మొదటి పాఠశాల. నిజాయితీ, బాధ్యత, క్రమశిక్షణ, పరస్పర గౌరవం వంటి విలువలు కుటుంబం నుంచే నేర్చుకుంటారు. తల్లిదండ్రుల ప్రవర్తన పిల్లల వ్యక్తిత్వంపై గాఢమైన ప్రభావం చూపుతుంది. అందువల్ల కుటుంబంలో విశ్వాసం, నిజాయితీ, పారదర్శకత ఉండటం అత్యంత అవసరం. "మీ నిజాయితీ మీ పిల్లలకు అందించే గొప్ప వారసత్వం" అనే మాట ఇక్కడ సార్థకమవుతుంది.

అలాగే కుటుంబ నిర్వహణ కూడా ఒక కళ. ప్రతి సభ్యుడి స్వభావాన్ని అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను గౌరవించడం, సమస్యలను ఓర్పుతో పరిష్కరించడం, ప్రేమతో వ్యవహరించడం కుటుంబాన్ని బలంగా నిలబెడతాయి. కుటుంబంలో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్నది ముఖ్యంకాదు; కుటుంబ బంధాలు నిలబడ్డాయా లేదా అన్నదే ముఖ్యం.

నేటి సమాజంలో కుటుంబాల్లో విశ్వాసం తగ్గిపోవడం ఒక సామాజిక సవాలుగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పరస్పర సంభాషణను పెంచాలి. కుటుంబ సభ్యులు కలిసి సమయం గడపాలి. సహనం, గౌరవం, క్షమించే గుణం పెంపొందించుకోవాలి. సాంకేతికతను ఉపయోగించాలి కానీ అది సంబంధాలను దూరం చేసే స్థాయికి వెళ్లకూడదు.

కుటుంబంలో విశ్వాసం ఉంటే సమస్యలు వచ్చినా వాటిని కలిసి ఎదుర్కొనే శక్తి లభిస్తుంది. అందుకే కుటుంబ బంధాలకు పునాది ప్రేమ అయితే, ఆ ప్రేమను నిలబెట్టేది విశ్వాసమే. విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రతి కుటుంబ సభ్యుడి బాధ్యత.

# శత్రుఘ్నుడు-ఆధునిక సమాజానికి బాధ్యత, విధేయత, సేవాభావం యొక్క ఆదర్శం

**రామాయణంలోని శత్రుఘ్నుడు ఎక్కువగా చర్చకు రాని పాత్ర అయినప్పటికీ, ఆయన వ్యక్తిత్వంలో నేటి సమాజానికి అత్యంత అవసరమైన విలువలు దాగి ఉన్నాయి. నాయకత్వం, కీర్తి, అధికారాల కంటే బాధ్యత, విధేయత, మరియు నిస్వార్థ సేవకు ఆయన ప్రతీకగా నిలుస్తాడు. ఆధునిక ప్రపంచంలో వ్యక్తిగత విజయానికి ఎక్కువ ప్రాధాన్యం పెరిగిన ఈ సమయంలో, శత్రుఘ్నుడి జీవితం సమాజం, కుటుంబం, మరియు సంస్థల అభివృద్ధికి అవసరమైన విలువలను గుర్తుచేస్తుంది. శత్రుఘ్నుడు నలుగురు సోదరులలో అత్యంత శాంత స్వభావుడు, కానీ తన నిశ్శబ్దమైన కృషితో, కుటుంబానికి మరియు రాజ్యానికి అచంచలమైన సేవతో, ఆయన ఒక ఆదర్శ సహాయకుడిగా నిలుస్తాడు. ఆయన వ్యక్తిత్వం మనకు తెలియజేస్తుంది---నాయకత్వం అంటే కేవలం ముందు నడిపించడం మాత్రమే కాదు, బాధ్యతను నిశ్శబ్దంగా మోసే వారిలోనూ గొప్పతనం దాగి ఉందని.**




### బాధ్యతాయుతమైన పౌరసత్వం

నేటి సమాజంలో ప్రతి వ్యక్తి తన హక్కుల గురించి మాట్లాడుతున్నాడు. అయితే బాధ్యతల గురించి ఆలోచించే వారు తక్కువగా కనిపిస్తున్నారు. శత్రుఘ్నుడు తన వ్యక్తిగత ఆశయాల కంటే తన కర్తవ్యానికి ప్రాధాన్యం ఇచ్చాడు.

ప్రస్తుతం కూడా ఒక మంచి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ అధికారి లేదా పౌరుడు తన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తే సమాజం మరింత మెరుగుపడుతుంది. శత్రుఘ్నుడు మనకు బాధ్యత అనేది పదవితో కాదు, మన నిబద్ధతతో నిర్ణయించబడుతుందని నేర్పుతాడు.

### జట్టుగా పనిచేసే సంస్కృతి

నేటి కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, మరియు ప్రభుత్వ వ్యవస్థలు "టీమ్ వర్క్" మీద ఆధారపడి ఉంటాయి. ప్రతి ఒక్కరూ నాయకుడిగా ఉండలేరు. ఒక జట్టు విజయవంతం కావాలంటే నాయకుడితో పాటు బాధ్యతాయుతంగా పనిచేసే సభ్యులు కూడా అవసరం.

శత్రుఘ్నుడు భారతుడికి అండగా నిలిచి రాజ్యపాలనను సమర్థవంతంగా నడిపించాడు. అలాగే నేటి సంస్థల్లో కూడా తమ పనిని నిశ్శబ్దంగా, సమర్థంగా నిర్వహించే ఉద్యోగులే విజయానికి పునాది అవుతారు.

కుటుంబ వ్యవస్థలో శత్రుఘ్నుడి ఆదర్శం

ప్రస్తుత కాలంలో కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయి. స్వార్థం, ఆస్తి వివాదాలు, మరియు వ్యక్తిగత ప్రయోజనాలు కుటుంబ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి.

శత్రుఘ్నుడు తన సోదరుల పట్ల చూపిన ప్రేమ, విశ్వాసం, మరియు అంకితభావం నేటి కుటుంబాలకు ఆదర్శం. కుటుంబ సభ్యులు పరస్పరం సహకరించుకొని, ఒకరి బాధ్యతలను మరొకరు పంచుకుంటే కుటుంబ వ్యవస్థ మరింత బలపడుతుంది.

### నిజాయితీ మరియు నైతికత

అవినీతి, అసత్య ప్రచారం, మరియు నైతిక విలువల క్షీణత వంటి సమస్యలు నేటి సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శత్రుఘ్నుడి ధర్మబద్ధత ఎంతో ప్రాసంగికంగా మారుతుంది.

ఆయన వ్యక్తిగత లాభాల కోసం కాకుండా ధర్మం కోసం పనిచేశాడు. నేటి రాజకీయ నాయకులు, అధికారులు, మరియు వ్యాపారవేత్తలు కూడా ఇదే సూత్రాన్ని అనుసరిస్తే సమాజంలో న్యాయం మరియు విశ్వాసం పెరుగుతాయి.

### ఒత్తిడిలో సమతుల్యత

ప్రస్తుతం విద్య, ఉద్యోగం, వ్యాపారం, మరియు వ్యక్తిగత జీవితంలో ఒత్తిడులు పెరుగుతున్నాయి. చిన్న సమస్యలకే ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి కనిపిస్తోంది.

శత్రుఘ్నుడు ఎప్పుడూ సహనం కోల్పోకుండా ధర్మాన్ని అనుసరించాడు. ఆయన జీవితంలో కనిపించే స్థిరత్వం, నేటి యువతకు మరియు నాయకులకు ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడం నేర్పుతుంది.

### సేవా నాయకత్వం

నేటి ప్రపంచంలో నాయకత్వాన్ని అధికారం మరియు నియంత్రణగా చూస్తారు. కానీ శత్రుఘ్నుడు నాయకత్వానికి మరో కోణాన్ని చూపించాడు---సేవా నాయకత్వం.

ఆయన అధికారాన్ని కోరుకోలేదు; అవసరమైనప్పుడు బాధ్యతను స్వీకరించి సేవ చేశాడు. ఆధునిక సంస్థల్లో కూడా ప్రజల అవసరాలను అర్థం చేసుకొని వారికి సేవ చేసే నాయకులే నిజమైన మార్పును తీసుకురాగలరు.

### యువతకు శత్రుఘ్నుడి సందేశం

ఈ కాలంలో యువత ఎక్కువగా గుర్తింపు, సంపద, మరియు విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇవి ముఖ్యమైనవే అయినప్పటికీ, వాటిని సాధించే మార్గంలో నిబద్ధత, క్రమశిక్షణ, మరియు విధేయత కూడా అంతే అవసరం.

శత్రుఘ్నుడు మనకు చెబుతున్న సందేశం ఏమిటంటే---నిజమైన విజయం ఇతరుల కంటే పైకి ఎదగడంలో కాదు; మన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించడంలో ఉంది.

నేటి సమాజానికి శత్రుఘ్నుడి శాశ్వత సందేశం ఏమిటంటే: " ప్రతిష్ఠ కోసం కాదు, బాధ్యత కోసం పనిచేసే వ్యక్తులే సమాజానికి నిజమైన బలం ." శత్రుఘ్నుడి జీవితం మనకు ఒక ముఖ్యమైన సత్యాన్ని గుర్తుచేస్తుంది. ప్రతి వ్యవస్థలో కనిపించే నాయకుల కంటే, నిశ్శబ్దంగా కృషి చేసే వ్యక్తులే ఆ వ్యవస్థకు అసలైన ఆధారం.

### ముగింపు

శత్రుఘ్నుడు మనకు నేర్పేది నిస్వార్థ సేవ, విధేయత, క్రమశిక్షణ, మరియు బాధ్యత. నేటి కుటుంబాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, మరియు కార్యాలయాలు ఈ విలువలను ఆచరిస్తే మరింత సమర్థవంతమైన, న్యాయబద్ధమైన, మరియు సమతుల్యమైన సమాజాన్ని నిర్మించవచ్చు.

అందువల్ల శత్రుఘ్నుడు కేవలం రామాయణంలోని ఒక పాత్ర మాత్రమే కాదు; ఆధునిక సమాజానికి బాధ్యతాయుత జీవన విధానాన్ని చూపించే శాశ్వత ఆదర్శం.



ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు

# నాన్న ఎందుకో వెనకబడ్డాడు...

మాటల్లో అమ్మ ప్రేమ... మౌనంలో నాన్న త్యాగం

నాన్నంటే నమ్మకం... నాన్నంటే భరోసా... నాన్నంటే ధైర్యం... నాన్నంటే బాధ్యత

అమ్మ ప్రేమ గురించి మాట్లాడినంతగా నాన్న ప్రేమ గురించి మాట్లాడం. తల్లి ప్రేమను అందరూ గొప్పగా కొనియాడతారు. కానీ నాన్న ప్రేమను వ్యక్తపరచడానికి, ఆయనతో ఉన్న అనుబంధాన్ని మాటల్లో చెప్పడానికి ఎందుకో మనసు తడబడుతుంది. అది భయమో, గౌరవమో, ప్రేమో. ఏదో చెప్పలేని భావన.

నిజానికి నాన్న ప్రేమ మాటల్లో కాదు. మౌనంలో వ్యక్తమవుతుంది. నవమాసాలు మోసి మనకు జన్మనిచ్చిన తల్లి ఎంత గొప్పదో, జీవితాంతం తన కలలను త్యాగం చేసి మన కలల కోసం పోరాడే నాన్న కూడా అంతే గొప్పవాడు.

అందుకే ప్రతి సంవత్సరం జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డేను జరుపుకుంటాం. అది కేవలం ఒక రోజును గుర్తు చేసుకోవడం కాదు. మన జీవితానికి దారి చూపిన వ్యక్తిని స్మరించుకోవడం.

అమ్మ పరిచయం చేస్తుంది... నాన్న దారి చూపిస్తాడు

అమ్మ మనల్ని ఈ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. నాన్న ఈ ప్రపంచంలో ఎలా నిలబడాలో నేర్పిస్తాడు. తల్లి ప్రేమను కళ్లతో చూస్తాం. నాన్న ప్రేమను జీవితాంతం అనుభవిస్తాం.

ఆయన కోపంలో చులకన ఉండదు. బాధ్యత ఉంటుంది. ఆయన మౌనంలో నిర్లక్ష్యం ఉండదు. అపారమైన ప్రేమ దాగి ఉంటుంది.

తన కలల కంటే మన కలలే ముఖ్యం

తన కలలను పక్కనపెట్టి, పిల్లల కలలను నిజం





చేయడానికి శ్రమించేవాడు నాన్న. అనారోగ్యంతో ఉన్నా పని ఆపడు. బాధలో ఉన్నా బాధ్యతను మరవడు. కుటుంబం సంతోషంగా ఉండాలనే ఒక్క ఆలోచనతో నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు.

పిల్లల ఎదుగుదలే ఆయన గమ్యం. వారే ఆయన ఆశలు. వారే ఆయన ఆయుష్షు. తన విజయాల కంటే పిల్లల విజయాలకే ఎక్కువగా ఆనందపడే వ్యక్తి నాన్న.

కనిపించని బలం

వేర్లు కనిపించవు. కానీ చెట్టు నిలబడటానికి అవే ఆధారం. అలాగే కుటుంబానికి కనిపించని బలంగా నిలిచేవాడు నాన్న. పురస్కారాలు రాకపోయినా, గుర్తింపు లేకపోయినా కుటుంబం కోసం అహర్నిశలు శ్రమిస్తూనే ఉంటాడు.

మన విజయాల వెనుక నిలిచే నిశ్శబ్ద శక్తి ఆయనే. నాన్న ఉన్నప్పుడు ఆయన విలువ పూర్తిగా అర్థం కాదు. కానీ ఆయన లేకపోవడాన్ని మాత్రం జీవితం మొత్తం మర్చిపోలేం.

నాన్న వెనకబడలేదు... మనమే ఆయనను వెనకబెట్టాం

తల్లి ప్రేమను తరచూ గుర్తు చేసుకుంటాం. నాన్న ప్రేమను మాత్రం చాలా సందర్భాల్లో సహజంగా తీసుకుంటాం. ఆయన తన త్యాగాల గురించి చెప్పుకోడు. తన కష్టాలను బయటపెట్టుకోడు. కానీ ప్రతిరోజూ తన కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం నిశ్శబ్దంగా పోరాడుతూనే ఉంటాడు.

అందుకే నాన్న వెనకబడలేదు. మనమే ఆయనను వెనకబెట్టాం. వాట్సాప్ స్టేటస్‌ల్లో అమ్మ ఫోటోలు పెడతాం. నాన్నతో ఫోటో ఎప్పుడు పెట్టాం?

తల్లిదండ్రులే నిజమైన దేవుళ్లు

తల్లిదండ్రులు తమ కోసం కాదు. పిల్లల కోసం జీవిస్తారు. వారి ఆనందంలోనే తమ ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాంటి తల్లిదండ్రులకు ప్రేమ, గౌరవం, ఆదరణ ఇవ్వడం బాధ్యత మాత్రమే కాదు. మన కర్తవ్యం కూడా.

వారిని నిర్లక్ష్యం చేయడం కేవలం ఒక తప్పు కాదు. మనిషితనానికే మాయని మచ్చ. ఫాదర్స్ డే రోజున మాత్రమే కాదు. ప్రతి రోజూ నాన్న ప్రేమను గుర్తుచేసుకుందాం. ఆయన త్యాగాలను గౌరవిద్దాం.

ఎందుకంటే మన జీవితంలో కనిపించని హీరో మన నాన్న. ఆయన లేకపోతే మనం లేము. ఆయన లేకపోతే ఈ జీవితం లేదు.

హ్యాపీ ఫాదర్స్ డే



జి. అజయ్ కుమార్

## తెలుగు నాటక రంగానికి

# నవచైతన్యం ఆవశ్యకత

(సి.హెచ్.ప్రతాప్)

తెలుగు సాహిత్య సంపదలో నాటక రంగానికి విశిష్ట స్థానం ఉంది. ఒకప్పుడు గ్రామాల నుంచి పట్టణాల వరకు నాటకాలు ప్రజల వినోదానికి మాత్రమే కాకుండా సామాజిక చైతన్యానికి, సాంస్కృతిక వికాసానికి ప్రధాన వేదికలుగా నిలిచేవి. పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, చారిత్రక నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేసేవి. కళాకారుల నటన, సంభాషణలు, సంగీతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవి. కానీ కాలక్రమేణా సినిమా, టెలివిజన్, డిజిటల్ వినోద మాధ్యమాల ప్రభావంతో తెలుగు నాటక రంగం తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. ఇప్పుడు ఈ కళారూపానికి మళ్లీ జీవం పోయాల్సిన అవసరం ఉంది.

తెలుగు నాటక రంగం ఒకప్పుడు అనేక గొప్ప కళాకారులను సమాజానికి అందించింది. రంగస్థలంపై నటించి తరువాత సినిమాల్లో వెలుగొందిన మహానటులు ఎందరో ఉన్నారు. నాటక రంగం కళాకారుల ప్రతిభకు నిజమైన పాఠశాలగా నిలిచింది. సంభాషణల ఉచ్చారణ, భావవ్యక్తీకరణ, వేదికపై ప్రవర్తన వంటి అంశాల్లో నాటక రంగం ఇచ్చిన శిక్షణ అపూర్వం. ఈ సంప్రదాయం క్రమంగా తగ్గిపోవడం సాంస్కృతికంగా ఒక నష్టమే.

ప్రస్తుత కాలంలో యువతలో నాటకాలపై ఆసక్తి తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. సరైన ప్రోత్సాహం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, ప్రదర్శన వేదికల కొరత, ప్రేక్షకుల ఆదరణ తగ్గడం వంటి సమస్యలు నాటక రంగాన్ని బలహీనపరిచాయి. అనేక నాటక సమాజాలు నిలిచిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు జరిగే నాటక పోటీలు కూడా చాలా వరకు కనుమరుగయ్యాయి. దీంతో కొత్త రచయితలు, దర్శకులు, నటులు ముందుకు వచ్చే అవకాశాలు తగ్గిపోయాయి.

తెలుగు నాటక రంగ పునరుద్ధరణకు ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు, విద్యాసంస్థలు కలిసికట్టుగా కృషి చేయాలి. ప్రతి జిల్లాలో నాటక కళాకారులకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో నాటకోత్సవాలను ప్రోత్సహించాలి. యువతకు రంగస్థల కళలపై అవగాహన కల్పించాలి. నాటక రచయితలకు ప్రోత్సాహక బహుమతులు, కళాకారులకు ఆర్థిక సహాయం అందించాలి. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నాటకాలను డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించే ప్రయత్నాలు చేయాలి.

సమాజ సమస్యలను ప్రతిబింబించే సాంఘిక నాటకాలు తిరిగి రావాలి. కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, యువత సమస్యలు, గ్రామీణ జీవితం వంటి అంశాలపై నాటకాలు రూపొందిస్తే ప్రజల్లో చైతన్యం పెరుగుతుంది. నాటకం కేవలం వినోదం మాత్రమే కాదు; అది సమాజానికి అద్దం. ప్రజలలో ఆలోచన రేకెత్తించే శక్తి నాటకానికి ఉంది.

నేటి తరానికి అనుగుణంగా చిన్న నాటికలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు, సాంకేతిక హంగులతో కూడిన రంగస్థల ప్రదర్శనలు తీసుకురావాలి. సామాజిక మాధ్యమాల ద్వారా నాటక కళను యువతకు చేరువ చేస్తే ఆసక్తి పెరుగుతుంది. రాష్ట్ర స్థాయిలో నాటకోత్సవాలు, పురస్కారాలు నిర్వహిస్తే కళాకారుల్లో కొత్త ఉత్సాహం ఏర్పడుతుంది.

తెలుగు భాషా మాధుర్యాన్ని, సాంస్కృతిక సంపదను నిలబెట్టడంలో నాటక రంగం కీలక పాత్ర పోషిస్తుంది. రంగస్థల కళలు బలపడితే భాషా పరిరక్షణ కూడా సాధ్యమవుతుంది. పాత నాటకాల వైభవాన్ని గుర్తుచేసుకుంటూ కొత్త తరానికి అనుగుణంగా మార్పులు తీసుకువస్తే తెలుగు నాటక రంగం మళ్లీ తన స్వర్ణయుగాన్ని చేరుకోగలదు. కళను కాపాడటం అంటే మన సంస్కృతిని కాపాడటమే అనే భావన ప్రతి ఒక్కరిలో పెరగాలి.

# మోదీ ఆశయాలను ప్రతి కుటుంబం ఆచరించాలి




### ఎమ్మెల్యే నల్లమిల్లి

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తక్కువ వంటనూనె, తక్కువ గ్యాస్ వినియోగాన్ని ప్రతి కుటుంబం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి సూచించారు. భారతీయ జనతా పార్టీ తూర్పుగోదావరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య ఆధ్వర్యంలో అనపర్తిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగానే తక్కువ నూనె, తక్కువ ఇంధనం వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అధిక నూనె వినియోగం ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని, తక్కువ నూనెతో వంటలు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ఆరోగ్యవంతమైన కుటుంబాలు ఏర్పడితేనే ఆరోగ్యవంతమైన సమాజం, తద్వారా ఆరోగ్యవంతమైన భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తక్కువ గ్యాస్, నూనె వినియోగం వల్ల కుటుంబాల ఆర్థిక భారం తగ్గడంతో పాటు పొదుపు పెరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రతి కుటుంబం చిన్న చిన్న పొదుపు చర్యలను అలవర్చుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి కూడా దోహదపడుతుందని అన్నారు. అలాగే ఇంధన వినియోగం తగ్గడం వల్ల పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ తరహా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆరోగ్యం, పొదుపు, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన గృహిణులకు తక్కువ నూనె, తక్కువ గ్యాస్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, వాటిని రోజువారీ జీవితంలో ఆచరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు.

## అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం

### రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

### ఖరీఫ్ సీజన్‌కు ముందే నిధులు మంజూరు

**టెక్కలి జూన్ 20 జయ జయహే**



రాష్ట్రంలో రైతుల సాగుకు ముందే ఖరీఫ్ సీజన్ కు రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు తొలి విడతగా రూ 183 కోట్లు రాష్ట్ర కూటమి ప్రభుత్వం విడుదలకు సిద్ధంగా ఉందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నేరుగా రైతుల ఖాతాల్లోరూ, 7000 నిధులు జమ చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ మంత్రి క్యాంపు కార్యాలయంలో అచ్చన్న మీడియాకు వివరించారు, అన్నదాతలకు భూమి సాగు పెట్టుబడుల నిమిత్తం రైతులను ఆర్థిక సహాయంతో ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి శ్రీకారం చుట్టిందని 2026 బి 27 ఆర్థిక ఏడాదికి గాను ఖరీఫ్ సీజన్ కు ముందే రైతులకు ఈ సహాయాన్ని విడుదల చేస్తుందన్నారు. సుఖీభవ పథకశీ లో జిల్లాలో 2.79 ,100 మంది రైతులు లబ్ధి పొందుతారని తెలిపారు, కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ క్రింద 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వంతుగా రూ 5 వేలు మొత్తం 7000 రూపాయలను అన్నదాతల బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. కేవలం ఆర్థిక సహాయమే కాక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు, ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందించి ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు బిందు సేద్యానికి 90% సబ్సిడీ కల్పిస్తున్నామని అన్నారు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు తెలిపారు.






# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తూ సహకరించాలని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, కె.ఎన్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన నాయకులు,32వ వార్డు మాజీ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని 32వ వార్డు అల్లిపురం మార్కెట్ ప్రాంతంలో ఆయన ప్రారంభించారు. స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రంచేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్త పారిశుధ్య విప్లవాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. అందమైన నగరాలను నిర్మించాలనే లక్ష్యంతో, కూటమికి చెందిన ఎన్నికైన ప్రతినిధులు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" "స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాలను నేరుగా క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి ప్రారంభించారని వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే నిజమైన పరిశుభ్రతను సాధించగలమని చెప్పారు నగరాల స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా ప్రమాణాలే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యమని, ప్రజా జీవనంలో పరిశుభ్రతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో భాగంగా, ప్రజలలో అవగాహన కల్పించడానికి తాము కృషి చేస్తున్నామని, మన పరిసరాలు పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే కేవలం ప్రభుత్వ ప్రయత్నాలు మాత్రమే కాకుండా ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఎస్.ఐ. కీర్తి, వార్డు సెక్రెటరీలు,మేస్త్రీ, సూపర్వైజర్, ఫిష్,వెజిటబుల్ మార్కెట్ వ్యాపారులు, ఎస్.హెచ్.జి.సభ్యులు పాల్గొన్నారు.



## ఉప ముఖ్యమంత్రి పర్యటనకు మునికూడలి ఘాట్‌లో ఏర్పాట్ల పరిశీలన

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి ఘాట్‌లో ఈ నెల 22న జరగనున్న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఘాట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, ప్రజల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తాత్కాలిక సదుపాయాల ఏర్పాటు, అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేలా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో పీడీసీ మహేష్, డీపీఓ వి. శాంతామణి, ఇరిగేషన్, ఆర్ఎంసీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొని ఏర్పాట్లపై కమిషనర్‌కు వివరాలు అందించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మునికూడలి ఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు వేగవంతంగా కొనసాగుతున్నాయి.



### అనకాపల్లి జోనల్ కార్యాలయంలో

# విఎంఆర్‌డిఎ ప్రజా దర్బార్

**విశాఖపట్నం (జయ జయహే)**

వి ఎం ఆర్ డి ఎ కి సంబంధించి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 23 న (మంగళవారం) అనకాపల్లి వి ఎం ఆర్ డి ఎ జోనల్ కార్యాలయంలో నిర్వహించటం జరుగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన వెంటనే సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఇప్పటివరకు దిగ్విజయంగా వి ఎం ఆర్ డి ఖకార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతోంది. అయితే మొట్టమొదటిసారి గా విశాఖపట్నం వెలుపల అన కాపల్లి రావుగోపాలరావు కళాక్షేత్రంలో ఉన్న వి ఎం ఆర్ డి ఏ జోనల్ ఆఫీసులో చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి కేవలం సమస్యలపై అర్జీలను స్వీకరించటం జరుగుతుంది. కావున అనకాపల్లి సమీప ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు



# శ్రీ సింహగిరి విద్యాసంస్థల ఆధ్వర్యంలో యోగాంధ్ర

**విజయనగరం, జూన్ 20:(జయ జయహే )**

యోగేంద్ర వారోత్సవాల్లో భాగంగా శ్రీ సింహగిరి విద్యాసంస్థల కాలేజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం శ్రీ సింహగిరి విద్యాసంస్థల అధినేత, ప్రముఖ సంఘ సేవకులు సింహగిరి పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రముఖ యోగా గురువు సాలూరు చక్రధర్ పట్నాయక్ చే విద్యార్థినీ విద్యార్థులకు యోగ యొక్క విశిష్టతను ఆవశ్యకతను, యోగాసనాల పై అవగాహనను మరియు ఆసనాలు వేస్తూ విద్యార్థులతో చేయిస్తూ వాటి యొక్క ప్రయోజనాలను తెలిపారు. ఈ కార్యక్రమమును సెక్రెటరీ బి సుమైల, హెల్త్ కేర్ అండ్ అల్లైడ్ ప్రొఫెషనల్ కౌన్సిల్ విజయవాడ వారి మరియు ఆర్.ఐ.వో. ఇంటర్ బోర్డు తవిటి నాయుడు విజయనగరం వారి ఆదేశానుసారం ఈ కార్యక్రమం జరిపించినట్లు కరస్పాండెంట్ సింహగిరి పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసారు

### ఆత్మహత్యల నివారణకు

# అవగాహనే ఆయుధం

### నో సూసైడ్' మాసోత్సవాలపై అవగాహనా సదస్సు"

**శ్రీకాకుళం జిల్లా, జూన్ 19:(జయ జయహే )**

మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ ఆదేశాల మేరకు, ఆత్మహత్యల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జూన్ 15 నుండి జూలై 15 వరకు నెల రోజుల పాటు 'నో సూసైడ్' మాసోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ శ్రీకాకుళం జిల్లా వారి ఆధ్వర్యంలో కేజీబీవీ పొన్నాడ నందు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ స్టాప్ సెంటర్ ఏఎస్ఐ కె . రేణుకారాణి నో సూసైడ్ మానస్ వికాస్'లి కార్యక్రమాల ఉద్దేశ్యాలను వివరించడంతో పాటు, మానసిక ఆరోగ్య పరిరక్షణ, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం వంటి అంశాలపై పాల్గొన్న వారికి విస్తృత అవగాహన కల్పించారు. అలాగే మానసిక ఆరోగ్య సహాయానికి సంబంధించిన 14416 హెల్ప్‌లైన్ మహిళల సహాయార్థం 181 ఉమెన్ హెల్ప్‌లైన్ పిల్లల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ అత్యవసర సేవల కోసం ఠి112 పోలీస్ హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. వన్ స్టాప్ సెంటర్, ఐసీపీఎస్ మరియు ఇతర శాఖల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ ప్రసన్నా రాణి, ఐసీపీఎస్ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, కేజీబీవీ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### తిమ్మరాజుపాలెం

# ఏకేఆర్‌జీ హైస్కూల్‌లో పుస్తకాల విక్రయాల వ్యవహారం..

### గదిని సీజ్ చేసిన ఎంఈఓ-2

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని ఏకేఆర్‌జీ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. విద్యార్థి సంఘాల ఫిర్యాదుల మేరకు ఎంఈఓ-2 గురుమూర్తి శనివారం పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఒక గదిని సీజ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాచారం ప్రకారం, పాఠశాల ఆవరణలోని ఒక ప్రత్యేక గదిలో పెద్ద మొత్తంలో పాఠ్య, అనుబంధ పుస్తకాలు నిల్వ ఉంచి విద్యార్థులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని ఏబీవీపీ, ఏవీఎస్, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎంఈఓ-2 గురుమూర్తి పాఠశాలను సందర్శించి రికార్డులు, నిల్వ ఉన్న పుస్తకాలను పరిశీలించారు. తనిఖీల సమయంలో ఒక గదిలో పెద్ద సంఖ్యలో పుస్తకాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు, విచారణ పూర్తయ్యే వరకు ఆ గదిని సీజ్ చేసినట్లు తెలిసింది. పుస్తకాల నిల్వకు సంబంధించిన అనుమతులు, కొనుగోలు వివరాలు, విక్రయాల రికార్డులను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పాఠశాల యాజమాన్యం నుంచి వివరణ కోరినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులను నిర్దిష్ట దుకాణాలు లేదా ప్రచురణకర్తల పుస్తకాలు కొనుగోలు చేయాలని బలవంతపెట్టడం అనుమతించబడదు. తల్లిదండ్రులకు ఎంపిక స్వేచ్ఛ ఉండాలని విద్యాశాఖ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏకేఆర్‌జీ హైస్కూల్‌లో జరిగిన వ్యవహారం నిబంధనలకు విరుద్ధమా కాదా అన్న అంశంపై అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పాఠశాలల్లో పుస్తకాల విక్రయాల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే చర్యలను అరికట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విచారణ అనంతరం వాస్తవాలు బయటకు వస్తాయని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ఘటన విద్యా వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

For a pure tomorrow.. జయహో

## "మాడగడ" వ్యూ పాయింట్ వద్ద

# అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**అరకులోయ: జయ జయహే.**

ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకులోయ మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన 'మాడుగడ వ్యూ పాయింట్' వద్ద అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిషాంతి. టి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అందించిన అమూల్యమైన వరం యోగా. దీనిని కేవలం ఒక్క రోజుకే పరిమితం చేయకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలి అని పిలుపునిచ్చారు. ప్రస్తుత మారుతున్న జీవనశైలిలో తలెత్తుతున్న మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలకు యోగా ఒక అద్భుతమైన పరిష్కారమని, ఇది శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా ప్రసాదిస్తుందని ఆమె పేర్కొన్నారు.

యువతే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది

దేశ ప్రగతికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి





యువతే ప్రధాన బలమని, విద్యార్థులు యోగా పట్ల ప్రత్యేక ఆసక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. అల్లూరి వంటి ప్రకృతి సంపద కలిగిన ప్రాంతాల్లో యోగా చేయడం ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆకాంక్షించారు.

ఈ యోగా కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాడేరు మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ట్రైకర్ చైర్మన్ కె. కృష్ణారావు, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.సరిహద్దు ప్రాంతాల్లో యోగా పట్ల అవగాహన కల్పించడంతో పాటు, పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో మాడుగడ వ్యూ పాయింట్‌ను ఈ వేడుకకు వేదికగా ఎంచుకోవడం విశేషం.

# సురభి నాటక కలను భావితరాలకు అందించాలి







### చెరువు రామకోటయ్య పిలుపు

### ముగిసిన సురభి నాటకోత్సవాలు

**విశాఖపట్నం (జయ జయహే)**

సురభి నాటక కళను సజీవంగా భావితరాలకు అందించాలని బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు సామాజికవేత్త చెరువు కోటయ్య పిలుపునిచ్చారు. 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి వ్యవస్థను భావితరాలకు అందించాలని సూచించారు. కళాభారతిలో జరుగుతున్న సురభి నాటకోత్సవాల చివరి ప్రదర్శనశనివారం మాయాబజార్ నాటకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు సురభి కళాకారులకు బిల్డర్స్ అసోసియేషన్ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కళాభారతి అధ్యక్షులు ఎం ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ నగరంలో ఐదు రోజులు పాటు జరిగిన సురభి నాటకోత్సవాలలో తాను భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.పద్మశ్రీ పురస్కార గ్రహీత గోపాలరావు మాట్లాడుతూ సురభి వ్యవస్థ అద్భుతమైన కళాఖండం అని అభివర్ణించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ దాతల సహకారంతో సురభి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు జీ.వీ రామచంద్రరావు మాట్లాడుతూ ఈ నాటక కళకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు భానోదయ నాట్యమండలి వారికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థలం నటులు మీగడ రామలింగ స్వామి, నటులు దర్శకులు కొరిటాల ప్రభాకర్ రావు, ఉత్తరాంధ్ర పౌరాణిక కళాకారులు సంక్షేమ సంఘం కార్యదర్శి వంకాయలు మారుతి ప్రసాద్, సినీ నటులు ప్రసన్నకుమార్, బ్రహ్మ కుమారి రమక్క, భానోదయనాట్య మండలి కోఆర్డినేటర్ భాను ప్రసాద్, రచయిత మేడా మస్తాన్ రెడ్డి, సురభి నాటకోత్సవాలు సంధానకర్త శివ జ్యోతి, నటులు మేడా మస్తాన్ రెడ్డి, వండర్ కిడ్ విద్యా సంస్థల అధినేత మళ్ల రాము నాయుడు, బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ నాగనబోయిన నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు

**మాయాబజార్ నాటకం ... దర్శకత్వం ఆరు నాగబాబు**

ఈ నాటక నిర్మాణం శశిరేఖ, (బలరాముని కుమార్తె) మరియు అభిమన్యు (సుభద్ర కుమారుడు) వారి ప్రేమకథను వివరిస్తుంది. రాజు బలరాం తన కూతురిని తన మేనల్లుడు అభిమన్యుకి ఇచ్చి వివాహం చేయాలను కుంటున్నాడు. కానీ బలరాముడి భార్య రేవతి, నారదుడి ప్రభావంతో, లక్ష్మణ కుమార (ధుర్యోధన కుమారుడు) తో తన కుమార్తె వివాహం జరిపించాలని పట్టుదలతో ముందుకు వెళ్ళింది. తన భార్య నుండి వచ్చిన ఒత్తిడి కారణంగా, బలరాం తన కుమార్తెను అభిమన్యుకి వివాహం చేయాలన్న ప్రతిపాదనను తిరస్కరించాడు. నిరుత్సాహానికి గురైన అభిమన్యుడు తన తల్లి సుభద్రతో కలిసి అజ్ఞాతవాస (బహిష్కరణ)లో ఉన్న తన తండ్రి అర్జునుని కలవడానికి వెళ్తాడు. అభిమన్యుడు మరియు సుభద్ర ఒక అడవి గుండా వెళుతుండగా, వారు రాక్షస రాజు గటోత్కచ (భీముడు మరియు హిడింబల కుమారుడు) ను చూస్తారు. గటోత్కచ అభిమన్యుని పోరాటానికి ఆహ్వానిస్తాడు, కానీ సుభద్ర జోక్యం ద్వారా, గటోత్కచుడు తన ప్రాణ బంధువులు అని తెలుసుకుని వారిని తన ఇంటికి తీసుకువెళతాడు. ఘటోత్కచుడు అభిమన్యు మరియు ప్రేమ గురించి మరియు బలరాముడు శశిరేఖ వివాహం పట్ల విముఖత గురించి తెలుసుకుంటాడు. ఘటోత్కచూడు ఎలాగైనా శశిరేఖ అభిమానుల వివాహం జరిపిస్తాను అని ప్రమాణం చేస్తాడు. అతను ద్వారక నగరానికి వెళ్లి కృష్ణుడిని సహాయం కోసం అభ్యర్థిస్తాడు. ఇప్పుడు, తన మాంత్రిక శక్తులతో, గటోత్కచ శశిరేఖను అపహరించి, శశిరేఖగా మారువేషంలో లక్ష్మణ కుమార్ని వివాహం చేసుకుంటాడు. తరువాత, బలరాం తన కుమార్తెను అభిమన్యుకి బదులుగా లక్ష్మణ కుమార్తో వివాహం చేసుకున్నందుకు పశ్చాత్తాపపడతాడు. కృష్ణుడి సూచనపై, అతను ఘటోత్కచుడిని కలవడానికి వెళ్లి అభిమన్యు, సుభద్ర మరియు ఘటోత్కచలకు క్షమాపణలు చెప్పాడు. ఆ తర్వాత తన కూతురిని అభిమన్యుతో పెళ్లి గావిస్తాడు



## ఆలయ పనులు, పరిశీలించిన ఎస్సై నాని, జెవివిఎన్ మూర్తి

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

మండల కేంద్రంలోని రామాలయం సమీప కొండపైన నిర్మిస్తున్న సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పనులు అత్యంత చురుగ్గా సాగుతున్నాయి. శనివారం ఆలయ నిర్మాణ స్థలాన్ని స్థానిక ఎస్సై నాని, వైఎస్సార్సీపీ యువజన విభాగం జిల్లా నేత జె.వి.వి.ఎన్. మూర్తి మరియు ఆలయ కమిటీ స్వాములు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ముఖ్యంగా కొండపై ఆలయం నిర్మిస్తున్న ప్రదేశం వరకు వేగంగా జరుగుతున్న రోడ్డు పనులను దగ్గరుండి పరిశీలించారు . జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఈ ఆలయ భవన నిర్మాణానికి గాను టీటీడీ ఎండోమెంట్ విభాగం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు భక్తులు సైతం తమ వంతు ఆర్థిక, వస్తు సహాయాన్ని అందించి సహకరించాలని ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో స్వాములు దొన్ను, సీతారాం మరియు పలువురు భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# వయసు 104....యోగాలో నయా జోష్

### దుడుమ జలపాతం వద్ద 'మన్యం రాందేవ్ బాబా' అద్భుతాలు!

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తున్నారు 104 ఏళ్ల వృద్ధుడు ప్రధాని కాశీ విశ్వనాథం. అంత వయసు పైబడినా, యువకులకు సైతం సాధ్యం కాని రీతిలో ఆయన దుడుమ జలపాతం వద్ద అవలీలగా పలు రకాల యోగాసనాలు వేస్తూ పర్యాటకులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం.

**45 ఏళ్లుగా యోగా సాధన.. పర్యాటకులే జీవనాధారం**

మండలంలోని సంగడ గ్రామానికి చెందిన ప్రధాని కాశీ విశ్వనాథం గత 45 సంవత్సరాలుగా దుడుమ జలపాతం వ్యూ పాయింట్ వద్ద నివాసముంటూ నిత్యం యోగాసనాలు వేస్తున్నారు. వివిధ రకాల కఠినమైన భంగిమల్లో ఆయన వేస్తున్న ఆసనాలు చూపర్లను ఎంతో ఆకట్టుకోవడమే కాకుండా, ఆరోగ్యంపై ఆలోచింపజేస్తున్నాయి. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఆయన ప్రతిభను చూసి ఇచ్చే డబ్బులతోనే తాను జీవిస్తున్నట్లు ఆయన తెలిపారు.







అతనిని కలిసిన స్థానిక పాత్రికేయులతో అతను మాట్లాడుతూ నేను కేవలం పళ్ళు, పలహారాలు మాత్రమే తింటూ జీవనం సాగిస్తున్నాను. దుడుమ జలపాతం కింద ఉన్న పాతాళేశ్వర గృహ వద్ద సుమారు 25 ఏళ్ల పాటు కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవనం సాగించాను."

**ప్రధాని కాశీ విశ్వనాథం**

**'మన్యం రాందేవ్ బాబా'గా గుర్తింపు**

ఈ ప్రాంతంలో ఆయన ప్రదర్శిస్తున్న యోగా నైపుణ్యానికి పర్యాటకులు, స్థానికులు ముగ్ధులై ఆయన్ను "మన్యం రాందేవ్ బాబా" అని పిలుచుకుంటున్నారు. నేటి తరం ఒత్తిడి, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వేళ... వందేళ్ల వయసు దాటినా కేవలం ప్రకృతి ప్రసాదించిన ఆహారం తింటూ, యోగాను నమ్ముకుని జీవిస్తున్న కాశీ విశ్వనాథం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం కాశీ విశ్వనాథమును ప్రోత్సహిస్తూ తగు చేయూతనందించడంతో పాటు యోగ ప్రదర్శనలు ఇచ్చే విధంగా చర్యలు చేపడితే, నేటి సమాజానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# సమస్యల పరిష్కారంలో ప్రజలకు భరోసా కల్పించాలి

### సింహాచలం బీఆర్టీఎస్ బాధితులకు న్యాయం: గంటా

**విశాఖపట్నం, జూన్ 20:(జయ జయహే )**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగానే అధికారులు పాల్గొనే వేదికలే కాకుండా ఎమ్మెల్యేలు కూడా ప్రతి వారం పీజీఆర్ఎస్ లను నిర్వహిస్తున్నట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన నిర్వహించారు. ప్రజల విజ్ఞాపనలపై అధికారులు తక్షణమే స్పందించాలని.. సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న భరోసా కల్పించాలని సూచించారు. సింహాచలం బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణంలో కూల్చివేసిన ఇళ్ల పునర్నిర్మాణ ప్రయత్నాలను సింహాచలం దేవస్థానం అధికారులు అడ్డుకుంటున్న విషయాన్ని బాధితులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు కోసం స్థలమిచ్చి రోడ్డున పడ్డామని, మూడేళ్లుగా అద్దె ఇళ్లల్లో తల దాచుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గంటా స్పందిస్తూ తొలగించిన కట్టడాలకు జీవీఎంసీ పరిహారాన్ని పొందిన వారు పునర్నిర్మాణం చేసుకోవచ్చని.. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్టీఎస్ రోడ్డులో 41 టీడీఆర్ ల సేల్ ఆప్షన్ లు వెంటనే ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న వందకు పైగా టీడీఆర్ లు త్వరితగతిన జారీ చేయాలని ఏసీపీ శాస్త్రిని ఆదేశించారు. చిన్న రుషికొండ లో తొలగించిన 50 మంది చిల్లర వర్తకులకు న్యాయం చేయాలని, ఎండాడ బంగారమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతవాసులు కోరారు. ఆనందపురం జట్లమ్మ కొండ వద్ద ఇళ్లు కోల్పోయిన వారికి స్థలాలు మంజూరు చేయాలని అభ్యర్థించారు. 8 వ వార్డు సన్ కాలేజీ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తిమ్మాపురం, మధురవాడ ప్రాంతాల్లో ఆక్రమణలు అరికట్టాలని, పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని వినతి పత్రాలను సమర్పించారు. పీజీఆర్ఎస్ లో 11 రెవిన్యూ, 4 హౌసింగ్, 4 పురపాలక శాఖ వినతులు అందాయి.

## హామీలు మరిచి వైసిపి నేతలపై కక్షసాధింపులే కూటమి ప్రభుత్వ లక్ష్యం: జక్కంపూడి రాజా

**జయ జయహే :రాజమహేంద్రవరం, జూన్ 20:**



ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం, వైయస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్షసాధింపు రాజకీయాలకు తెరలేపిందని వైయస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా ధ్వజమెత్తారు. శనివారంరాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, తమ స్వార్థ ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు.మాజీ మంత్రి కారుమూరి సునీల్ కుమార్‌కు లిక్కర్ కేసుతో ఎటువంటి సంబంధం లేకపోయినా, రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. బిసి సామాజిక వర్గానికి చెందిన సునీల్‌ను రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో మద్యం మాఫియా అరాచకాలు పెచ్చరిల్లాయని, నిబంధనలను తుంగలో తొక్కి జనావాసాలు, బడి, గుడి అనే తేడా లేకుండా కూటమి నేతలు మద్యం షాపులను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు అమ్ముతూ పేదల జేబులకు చిల్లులు పెడుతున్నారని, ఈ ఆదాయం లోకేష్‌కు అందుతోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా లిక్కర్ పాలసీని అమలు చేశామని, మద్యం నియంత్రణలో భాగంగానే ధరలు పెంచామని రాజా స్పష్టం చేశారు. 2014-19తో పోలిస్తే 2019-24 మధ్య ప్రభుత్వ ఆదాయం రూ. 8 వేల కోట్లు పెరిగిందని గణాంకాలతో సహా వివరించారు.రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికి వదిలేసి, పోలీస్ స్టేషన్లను టీడీపీ కార్యాలయాలుగా మార్చారని విమర్శించారు. వైసీపీ నేతలను వేధించడమే పనిగా పెట్టుకున్న పోలీసులు, ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ డ్రగ్స్ వ్యవహారంలో మాత్రం నిస్సిగ్గుగా వ్యవహరించారని మండిపడ్డారు. మహిళా నిధి, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. కారుమూరి సునీల్‌కు వైయస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ఇలాంటి వేధింపులు పార్టీ నేతలను ఏమీ చేయలేవని హెచ్చరించారు.

## లభ్యమైన గల్లంతైన గిరిజనుడి మృతదేహం

### ఎస్సై నాని సమక్షంలో

### కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత

**ముంచంగిపుట్టు, జయ జయహే**



మండలంలో గల జోలాపుట్టు పంచాయితీ బోంద్రుగూడ గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లి మత్స్యగెడ్డలో శుక్రవారం గల్లంతైన నరంజి అద్దు(45) మృతదేహం లభ్యమైయింది. గల్లంతై అద్దు ఆచూకీ కోసం ఎస్ఐ నాని, ఎంపీటీసీ కమల, మాజీ సర్పంచ్ నీలకంఠం, రెవెన్యూ, పంచాయతీ అధికారులు గాలింపులను పర్యవేక్షించారు. అద్దు గల్లంతైన ప్రాంతంలో నాటు పడవలతో గాలింపులు ముమ్మరంగా చేయించారు. దీంతో వారీ శ్రమ ఫలించింది శనివారం ఉదయం 11 గంటకు మృతదేహాన్ని గుర్తించారు. గెడ్డ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి, అంబులెన్స్ లో ముంచంగిపుట్టు సీహెచ్ సీకి తరలించారు. పోస్ట్‌మార్టం నిర్వహించి, మృతదేహాన్ని ఎస్సై పి నాని సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ పెద్ద అద్దు చనిపోవడంతో దిక్కుతోచని విధంగా మా పరిస్థితి ఉందని ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# నిడదవోలులో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

## స్వచ్ఛాంధ్ర కోసం ప్రజల భాగస్వామ్యం అవసరం: మంత్రి కందుల దుర్గేష్..

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

రాష్ట్రాన్ని చెత్త రహితంగా, పరిశుభ్రమైన స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి అనుగుణంగా నిడదవోలు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' పారిశుద్ధ్య కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.. అనంతరం అధికారులు, ప్రజలతో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పట్టణాలు, గ్రామాలు చెత్తతో నిండిపోయాయని విమర్శించారు. పారిశుద్ధ్యాన్ని విస్మరించడమే కాకుండా చెత్తపై పన్ను విధించి ప్రజలపై అదనపు భారం మోపారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.నిడదవోలు మున్సిపాలిటీలో గత రెండేళ్లుగా కమిషనర్, ఛైర్మన్ ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం




అభినందనీయమని పేర్కొన్నారు. ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ వాహనాలకే అందించాలని మంత్రి కోరారు. తడి చెత్తతో కంపోస్ట్ ఎరువుల తయారీ ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరడమే కాకుండా రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిందని పేర్కొన్న మంత్రి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గుడ్డ సంచుల వినియోగాన్ని పెంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే పర్యావరణహిత సంచులను ఉపయోగించడం ద్వారా మహిళా సాధికారతకు కూడా తోడ్పాటు



అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 100 కుటుంబాల చిరకాల వాంఛ సాకారం

## సొంత స్థలాలపై హక్కులు కల్పించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూన్ 20**

ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోక, ఆందోళనలో ఉన్న సుమారు 100 కుటుంబాల సొంత ఇంటి కల నెరవేరింది. ఆర్ అండ్ బీ వాంబే గృహాల సమీపంలో, డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్న స్థలాలకు సంబంధించి దశాబ్ద కాలంగా కొనసాగుతున్న వివాదానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు మార్గం సుగమం చేస్తూ, సదరు స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఆ ప్రాంత ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా లబ్ధిదారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేశారు. కష్టార్జితంతో కొనుక్కున్న స్థలాలు ఎక్కడ చేజారిపోతాయోననే భయాందోళనల మధ్య ఈ కుటుంబాలు జీవించాయని, వారిని ఆ పరిస్థితి నుంచి బయటపడేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్నానని



తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, ఫైళ్లను వేగవంతం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు వివరించారు. ఈ మేరకు అధికారిక గెజిట్ నోటిఫికేషన్ మరియు మ్యాప్‌లను ప్రజలకు అందజేశారు.ఇక నిశ్చింతగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టవచ్చని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే, భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని ఆదర్శ కాలనీగా మారుస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించడంతో పాటు, శాస్త్రీయమైన లేఅవుట్‌ను సిద్ధం చేస్తామని వెల్లడించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకున్నారని లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. ప్రమీల రాణి మాట్లాడుతూ,



"గత ఆరేళ్లుగా మున్సిపల్ కార్యాలయం నుంచి అమరావతి వరకు తిరిగినా ఫలితం లేదు. కానీ ఎమ్మెల్యే వాసు మాకు ఇచ్చిన మాట ప్రకారం న్యాయం చేశారు" అని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ ఇన్‌చార్జ్ మరియు టీడీపీ జిల్లా కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణ, నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు స్థానిక లబ్ధిదారులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించారని టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ సందర్భంగాఅభినందించారు.

# యోగాంధ్రలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర--2026' కార్యక్రమంలో భాగంగా నిడదవోలు పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిడదవోలు పురపాలక సంఘం ఆధ్వర్యంలో సామూహిక యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని యోగా ఆసనాలు వేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వం. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరకంగా దృఢంగా, మానసికంగా ప్రశాంతంగా ఉండగలుగుతారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుంది" అని అన్నారు.ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, యోగాను ప్రతి ఇంటికీ చేరవేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత చిన్న వయస్సు నుంచే యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'యోగాంధ్ర--2026' కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆరోగ్యకర జీవనశైలిని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యోగా శిక్షకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# లైవ్ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగోత్సవ్

## ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారుల

**విజయవాడ (జయ జయహే)**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా లైవ్ భారత్ ఫౌండేషన్ మరియు జి.ఐ.జి ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో "యోగోత్సవ్--2026" కార్యక్రమం శనివారం ఉదయం గొల్లపూడి లోని జి.ఐ.జి ఇంటర్నేషనల్ స్కూల్ ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా లైవ్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ వల్లూరు ప్రకాష్ నారాయణ ఢిల్లీ నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థులకు తన సందేశాన్ని అందజేశారు. యోగ మన జీవితంలో ఆరోగ్యాన్ని నింపుతుందని, అనారోగ్యాల బారిన పడకుండా కాపాడటంతో పాటు శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే యోగను అలవాటు చేసుకోవాలని, ఆ ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థులు యోగను తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకుని ప్రతిరోజూ సాధన చేయాలని కోరారు. జి.ఐ.జి ఇంటర్నేషనల్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ఎన్. రమ్య మాట్లాడుతూ, యోగా దినోత్సవం సందర్భంగా మాత్రమే కాకుండా తమ పాఠశాలలో విద్యార్థులకు నిత్యం యోగా శిక్షణ అందించేందుకు కృషి





చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా, వారి మానసిక మరియు శారీరక ఉల్లాసాన్ని పెంపొందించే ఆటలు, పాటలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలకు కూడా తమ పాఠశాల ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ పాల్గొన్న అండర్-18 నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ డాలి శివాని మరియు ఆమె కోచ్ చెరుకూరి సత్యనారాయణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి విజయగాథలు, క్రీడా ప్రస్థానం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపగా, క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని అందించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఈ జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ డైరెక్టర్ చలపాటి వెంకటేశ్వరరావు, హెల్ప్ హాస్పిటల్స్ సీఈఓ చలపాటి జయంత్, మల్లెతీగ మాగజైన్ సంపాదకులు కలిమిశ్రీ, కార్యక్రమ నిర్వాహకులుభాను ప్రకాష్, మనోజ్ కమల్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి తమ సందేశాలను అందించారు.



# ఘనంగా జరిగిన రెవెన్యూ దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి, జూన్, శనివారం 20**

జయ జయహే రెవెన్యూ దినోత్సవ సందర్భంగా అనకాపల్లిలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నాట్య భారతి అకాడమీ చే నిర్వహించబడిన విద్యార్థుల చే నృత్య ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది ప్రేక్షకులను ఈ నృత్య నాట్య ప్రదర్శన లు బాగా ఆకట్టుకున్నాయి . ఈ అకాడమీలో బాగా నృత్య ప్రదర్శన చేసిన చిన్నారి సలాది గాయత్రి ప్రదర్శన ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నది జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆ పాపకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు గాయత్రి గతంలో అనేక నృత్య కార్యక్రమాలో పాల్గొని తన ప్రతిభను చాటుకుంది పలు రాష్ట్రాలోని ప్రముఖ దేవాలయాల్లో, శిరిడి క్షేత్రంలో మరి ఇతర పుణ్యక్షేత్రాలు లో అక్కడ ప్రదర్శన ఇచ్చి అందరు చే మన్నలను పొందడం జరిగింది పలు టీవీ కార్యక్రమాల్లో కూడా ఆమె ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. ఎంత చిన్న వయసులోనే ఎంతటి ప్రతిభ కనబరుస్తున్న గాయత్రి భవిష్యత్తులో మరిన్ని విజయాల సాధించాలని జిల్లా కలెక్టర్ ఆమెను ఆశీర్వదించడం జరిగింది.

# రాందేవ్ బాబాను అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించడం తగదు

## జన చైతన్య వేదిక

**గుంటూరు (జయ జయహే)**




ప్రజలను కోవిడ్ సమయంలో తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రకటనలు ఇచ్చి ఆధునిక వైద్య విధానాన్ని (అలోపతి) కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు 2023 లో విచారించి రాందేవ్ బాబా తో బహిరంగ క్షమాపణలు చెప్పించిందని, డ్రగ్స్ మరియు మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్ 1954ను ఉల్లంఘిస్తూ వివిధ వ్యాధులను పతంజలి మందులతో నయం చేస్తామని పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకించిందని అలాంటి రాందేవ్ బాబాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రమణ్యం తీవ్రంగా ఖండించారు. ఈనెల 20వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ రాందేవ్ బాబా పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులతో కోవిడ్ ను సంపూర్ణం గా నయం చేస్తామని ప్రపంచ ఆరోగ్య సంస్థ పతంజలి కోవిడ్ నివారణకు ఉత్పత్తి చేసిన కరోనిల్ మందును ఆమోదించిందనే తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను మోసం చేశారన్నారు. బిపి, షుగర్, అస్తమా లాంటి దీర్ఘకాలిక వ్యాధులను పూర్తిగా నయం చేస్తామంటూ పత్రికలలో భారీ ప్రకటనలు ఇవ్వడాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు పతంజలి సంస్థపై పిటిషన్ దాఖలు చేసిందని సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రజలకు రాందేవ్ బాబా బహిరంగ క్షమాపణలు ప్రకటిస్తూ పెద్ద ఎత్తున పత్రికలకు ప్రకటనలను ఇచ్చిన వ్యక్తి బాబా రాందేవ్ అని తెలిపారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ యోగా గురువుగా ప్రసిద్ధి గాంచిన బాబా రాందేవ్ పతంజలి సంస్థ ద్వారా 40 వేల కోట్ల రూపాయల ఉత్పత్తులను ప్రతి ఏటా అమ్ముతూ ప్రజల నమ్మకాలను లాభాలుగా మార్చుకున్న వ్యక్తి బాబా రాందేవ్ అని తెలిపారు. సుదీర్ఘ అనుభవం గల నారా చంద్రబాబు నాయుడు నేడు హిందుత్వ భావజాలాన్ని ప్రోత్సహిస్తున్నారని అందులో భాగంగానే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్యఅతిథిగా బాబా రాందేవ్ ను ఆహ్వానించారని వివరించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీని సంతృప్తి పరచడానికే హిందుత్వ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. భారతీయ ప్రజల్లో ఉన్న సనాతన భావాలను, మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తూ బాబా రాందేవ్ పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు ద్వారా ప్రతి ఏటా వేలాది కోట్ల రూపాయల లాభార్జన పొందుతున్నారని వివరించారు.



# "లాలాచెరువు జాతీయ రహదారిపై రవాణా శాఖ "

**రాజమహేంద్రవరం, జయ జయహే :జూన్ 20:**

రాజమండ్రి రూరల్ మండలంలోని లాలాచెరువు సమీప జాతీయ రహదారిపై శనివారం రవాణా శాఖ అధికారులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు.తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న పలు వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవిఐ) సంపత్ తెలిపారు. రవాణా నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించిన ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.వాహనదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలను సక్రమంగా కలిగి ఉండాలని, రవాణా నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎంవిఐ సంపత్ హెచ్చరించారు.

For a pure tomorrow.. జయహే

# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా!



మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుద్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్స్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్చ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తథా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# గౌరింట పూచింది కొమ్మ లేకుండా...!!!

## గోరింటాకు అసలు పేరు గౌరింటాకు...

(పుట్టా శ్రీనివాసరావు)

మహిళలు అమితంగా ఇష్టపడే గోరింటాకు ఆషాడ మాసంలో ఎక్కువగా అలంకరించుకుంటారు. గోరింటాకు అలంకరించుకున్న తర్వాత రెండు చేతులు ఎర్రగా పండితే ఇష్టమైన భర్త వస్తాడని చెబుతుంటారు. అలాగే ఆ చేతులు కూడా అద్దంగా కనిపిస్తాయి. ఆరోగ్యపరంగా ఇవి ఎంతో ఉపయోగపడతాయి కూడా.. అలాంటి గోరింటాకు గురించి ఒకసారి తెలుసుకుందాం...

గోరింటాకు అనబడే గౌరి ఇంటి ఆకు
గౌరీదేవి బాల్యంలో చెలికాండ్రు తో
వనంలో ఆటలాడే సమయాన
రజస్వల ఔతుంది ఆ రక్తపుచుక్క నేలతాకినంతనే
ఓ మొక్క పుడుతుంది. ఈవింతను
చెలులు పర్వతరాజుకు చెప్పగా సతీసమేతంగా
చూసేందుకు రాజు
వస్తాడు. అంతలోనే ఆచెట్టుపెద్దదై నేను సాక్షాత్పార్వతీ
రుధిరాంశతో
జన్మించాను.నా వలన లోకానికి
ఏ ఉపయోగంకలదూ అని అడుగుతుంది. అపుడు
పార్వతి(గౌరి) చిన్నతనపు చపలతతో ఆచెట్టు ఆకు కోయగా
ఆమె వేళ్లు ఎర్రబారిపోతాయి. అయ్యో బిడ్డచేయి
కందిపోయినదనుకునే లోపుగానే పార్వతి నాకు
ఏవిధమైనబాధా కలుగలేదు
పైగా చాలా అలంకారంగా అనిపిస్తోందీ అంటుంది.
పర్వతరాజు ఇకపై స్త్రీ
సౌభాగ్యం చిహ్నంగా
ఈగౌరింటాకు మానవలోకంలో
ప్రసిద్ధమవుతుందినీ , రజస్వల
సమయాన ఉద్భవించిన
ఈచెట్టు స్త్రీల
గర్భాశయదోషాలు
తొలగిస్తుందినీ చెప్పారు. అతిఉ
ష్ణం తొలగించి స్త్రీల ఆరోగ్యాన్ని
కాపాడుతుంది తనవర్ణం వలన
చేతులకు కాళ్లకూ అందాన్నిచ్చే
అలంకారవస్తువుగా
వాడబడుతుంది అదే ఈచెట్టు
జన్మకు సార్ధకత అని
పలుకగా గౌరి తో సహా
అందరూ ఆచెట్టు
ఆకులపసరుతో
చేతులు కాళ్లూ అందంగా తీర్చుకుంటుఉంటారు
ఆసమయంలో కుంకుమకు సందేహం కలుగుతుంది
నుదుటన కూడా ఈ ఆకు వలన
బొట్టుదిద్దుకుంటారేమో నా ప్రాధాన్యత తగ్గిపోతుందేమోనని
గౌరితో
ఆసందేహం చెప్పగా నుదుటన
పండదు అంటుంది కావాలంటే
చూడండీ గోరింటాకు నుదుటనపండదు.
ఇక శాస్త్రపరంగా గర్భశయదోషాలు తీసేస్తుంది




అరచేతి మధ్యలో స్త్రీ గర్భాశయానికి
రక్తంచేరవేసే
ప్రధాననాడులుంటాయి వాటిలోని అతిఉ
ష్ణాన్ని లాగేసి
ప్రశాంతపరుస్తుంది.
గోరింటాకు
ప్రసవం కాగానే గోరింటాకు ముద్దగా నూరి
ఆబాలింత చేత మింగిస్తే ప్రసవంవలన
ఏర్పడే గర్భాశయబాధలు నయమవుతాయి.
ఇక భర్తలకి గోరింటకూ ఉన్న
అనుబంధం
స్త్రీలోని స్త్రీత్వపు హార్మోనులపనితీరు చక్కగా
ఉన్నందువలన దేహంకూడా
అందంగా సున్నితంగా ఉంటుంది అలా
లేతగా ఉన్నచేతపెట్టుకున్న గోరింటాకు
మరింత అందంగా పండికనిపిస్తుందీ.ఆ
పండటం
అనేది ఆమగువ ఆరోగ్యాన్ని
సూచిస్తుంది ఆరోగ్యమే మహాభాగ్యం అందంగాఉన్నమ్మాయికి
చక్కనిభర్త వస్తాడు. ఆరోగ్యకరమైన దాంపత్యానికి
కారణమైన భార్యను ప్రేమిస్తాడుకదా. ...
పెద్దోళ్ళు ఏంచెప్పినా మరీ ఓ పది పన్నెండూ మైళ్లదూరదృష్టి
తోనే చెబుతారండీ...
అపోహలేంకాదు గౌరింటిఆకును అందరం శాస్త్రీయంగా
ఆదరిస్తే మనకూ
అన్నివిధాలా ఆరోగ్యం ఆనందమే.

# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రాధాన్యత: పండూరి అప్పారావు

రాజమహేంద్రవరం : జయ జయహే :జూన్ 20:

ధవళేశ్వరం అంగన్‌వాడీ కేంద్రాలు పటిష్టంగా ఉంటేనే చిన్నారుల ఆరోగ్యం బాగుంటుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు ప్రతి బిడ్డకూ అందాలని మండల అధ్యక్షులు పండూరి అప్పారావు స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు, రాజమండ్రి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు, శనివారం ధవళేశ్వరం పంచాయతీ పరిధిలోని కొండ మీద డబ్బా ట్యాంక్ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-3ను స్థానిక టీడీపీ నాయకులు సందర్శించారు.ఈ సందర్భంగా నాయకులు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కొంత సమయం గడిపారు. కేంద్రంలో అందుతున్న పోషకాహారం, గుడ్లు, పాలు నాణ్యతను పరిశీలించి, చిన్నారులకు అందుతున్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడి, అంగన్వాడి కేంద్రంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను త్వరలోనే పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్, గ్రామ టిడిపి అధ్యక్షులు పండూరి అప్పారావు, టిడిపి క్లస్టర్-5ఇన్చార్జ్ సావాడ శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్-6ఇన్చార్జ్ తలారి మూర్తి, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ నల్లా రమేష్, బూత్ కన్వీనర్లు దొడ్డి బాబ్జి, కర్ణం ఈశ్వరావు, యూనిట్ ఇన్చార్జ్ ఎల్లపు పాండు రంగారావు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## బి.ఎన్ రోడ్డుపై కూలిన బ్రిడ్జిలు

# నిర్మాణం చేపట్టాలి

చోడవరం జూన్ 20 జయ జయహే

చోడవరం నియోజకవర్గ పరిధిలోగల బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట, వడ్డాది లలో కూలిపోయిన బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. బి.ఎన్ రోడ్డు పనులు మొదలుపెట్టి సంబరాలు చేసుకోవాలని సలహా ఇచ్చారు. శనివారం సిపిఎం ప్రతినిధులు పేట కాజ్ వే పై మోకాళ్లపై నిరసన తెలిపారుఆగస్టు, సెప్టెంబర్ నెల వచ్చిందంటే అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాలో ప్రయాణికులకు గుండే దడ మొదలవుతుందన్నారు.తాత్కాలికంగా నిర్మించిన కాజువే భారీ వర్షాలకు ప్రతి సంవత్సరం కొట్టుకుపోతున్నాయి. దీనివల్ల అరగంట ప్రయాణం చేయవలసిన ప్రయాణికులు రెండు గంటలు ప్రయాణం చేయవలసి వస్తుందన్నారు. తక్షణమే బ్రిడ్జిలు నిర్మాణం పనులు చేపట్టాలి. బిఎన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే గోవిందరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.నర్సీపట్నం భీమిలి రోడ్డు లో ముఖ్యమైన బ్రిడ్జిలు కూలిపోవడంతో పాటు అనేక అలవాట్లు కూడా శిధిలావస్థలో చేరాయని అన్నారు. ప్రజలకి నరక కోపంగా మారిందని అన్నారు తక్షణమే అధికారులు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించాలని కూలిన బ్రిడ్జిలు పోను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

## రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో చోడవరం విద్యార్థిని మల్లా శ్రీహిత ప్రతిభ

చోడవరం జూన్ 20 జయ జయహే




యోగ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18, 19, 20 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర యోగ స్థాయి యోగాసన పోటీల్లో 18 నుండి 36 ఏళ్ల బాలికల విభాగంలో బిటెక్ ఫోర్త్ ఇర్ చదువుతున్న మల్లా శ్రీహిత ద్వితీయ స్థానం సాధించింది. దీంతో అనకాపల్లి జిల్లాకు చోడవరశీ పతంజలి యోగా కేంద్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని యోగ గురువు పుల్లేటి సతీష్ శనివారం తెలిపారు. ఈ విద్యార్థిని చోడవరం శాసనసభ సభ్యులు కేఎస్ఎన్ రాజు, అనకాపల్లి జిల్లా ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య , చోడవరం ఎంపీడీవో రాజు, గవరవరం ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ పద్మావతి, చోడవరం ఈవో గంగాధర్, బుచ్చియ్య పేట ఆయుష్ డాక్టర్ రామలక్ష్మి యోగా కేంద్ర సభ్యులు చోడవరం ప్రముఖులు పెద్దలు అభినందనలు తెలిపారు.



## త్రిశూల్ వద్ద విఎంఆర్‌డిఏ ఆధ్వర్యంలో యోగా సాధన

విశాఖపట్నం (జయ జయహే)



అంతర్జాతీయ యోగాదినోత్సవం పురస్కరించుకొని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ ఆదేశాలతో యోగా దినోత్సవం కైలాసగిరి పై ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం కైలాసగిరి పై ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన త్రిశూల్ వద్ద జరిగిన కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ ఉద్యోగులు, యోగాభ్యాసకులు పాల్గొని యోగా సాధన చేశారు. యోగా గురువు మొల్లేటి కిరణ్ యోగా వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తూ పలు యోగాసనాలను వేయించారు. ఆయా యోగాసనాల వల్ల మానసిక, శారీరక ఆరోగ్య పరంగా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరించారు. ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రకృతి అందాల నడుమ ఉన్న కైలాసగిరిలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని, యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే జీవన విధానమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవతో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో యోగ ను మన జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగ అత్యంత అవసరమని, యువత ప్రతిరోజూ కొంత సమయం యోగ సాధనకు కేటాయిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది అని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగ కీలక పాత్ర పోషిస్తుందని, వి ఎం ఆర్ డి ఎ పరిధిలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆరోగ్యం, పర్యావరణం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబంలో యోగ ఒక దినచర్యగా మారాలని ఆకాంక్షిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, అటవీ శాఖ అధికారి రమణమూర్తి ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్ , పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com